ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



	అభ్యర్థి పేరు	పోలైన ఓట్లు
1.	పేరాబత్తుల రాజశేఖరం(టీడీపీ)	1,24,702
2.	కాట్రు నాగబాబు	565
3.	షేక్ హుస్సేన్	394
4.	కట్టా వేణుగోపాలకృష్ణ	1017
5.	కాండ్రేగుల నరసింహం	364
6.	కాళ్ళూరి కృష్ణమోహన్	190
7.	కుక్కల గోవిందరాజు	269
8.	కునుకు హేమకుమారి	956
9.	కైలా లావణ్య	365
10.	గౌతమ్‌బాబు కొల్లు	317
11.	చిక్కాల దుర్గారావు	665
12.	తాళ్ళూరి రమేష్	201
13.	దత్తాత్రేయ నోరి	567
14.	దిడ్ల వీరరాఘవులు(పీడీఎఫ్)	47,241
15.	దొరబాబు యాళ్ళ	303
16.	నీతిపూడి సత్యనారాయణ	161
17.	తినిపి నాగభూషణవర్మ	68
18.	పిప్పళ్ళ సుప్రజ	479
19.	పేపకాయల రాజేంద్ర	199
20.	బొడ్డు శ్రీనివాసరావు	152
21.	బొమ్మనబోయిన వి.ఎస్.ఆర్.మూర్తి	119
22.	బొమ్మిడి సన్నీరాజ్	398
23.	బండారు రామ్మోహన్‌రావు	709
24.	భీమేశ్వరరావు చిక్కా	254
25.	మాకి దేవీప్రసాద్	146
26.	మెర్ల శాస్త్రులు	103
27.	మోకన అంబేద్కర్	129
28.	రాజపూడి	95
29.	జి.టి.రామారావు	39
30.	రేవులగడ్డ ముఖేష్‌బాబు	96
31.	వానపల్లి శివగణేష్	772
32.	శ్రీనివాస్ విష్ణువరుల	190
33.	ఎం.శ్రీనివాసరావు	41
34.	జి.వి.సుందర్	16,183
35.	హసన్ షరీఫ్	759

కూటమి కేక

ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ టీడీపీదే



విజేత రాజశేఖరం, టీడీపీ పశ్చిమ, ఏలూరు జిల్లాల అధ్యక్షులు రామరాజు, గన్ని విజయ సంకేతం

ఉభయ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజక వర్గంలో తొలిసారి తెలుగుదేశం పతాకం రెపరెపలాడింది. కూటమి బలపరిచిన టీడీపీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం భారీ మెజారిటీతో గెలుపొందారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సోమవారం ప్రారంభమై మంగళవారం మధ్యాహ్నం వరకు సుమారు 30 గంటలకు పైగా సాగింది. మొదటి రౌండ్ నుంచి తెలుగుదేశం అభ్యర్థి ఆధిక్యతతో దూసుకుపోయారు. సమీప పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు పై ఆధిక్యత కనబరిచారు. ఓట్ల లెక్కింపును సోమవారం రాత్రి రాజశేఖరం, వీరరాఘవులు, మరి కొందరు అభ్యర్థులు పరిశీలించారు.

1	పేరాబత్తుల రాజశేఖరం - టీడీపీ	ఓట్లు : 1,24,702
2	దిడ్ల వీరరాఘవులు - పీడీఎఫ్	ఓట్లు : 47,241
3	జీవీ సుందర్ - స్వతంత్ర	ఓట్లు : 16,183

- భారీ ఆధిక్యతతో రాజశేఖరం గెలుపు
- కలిసొచ్చిన ఉమ్మడి బాధ్యత
- వెనుకబడిన పీడీఎఫ్ అభ్యర్థి వీరరాఘవులు
- హ్యాట్రిక్ కలలు గల్లంతు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో పట్టభద్రులు తెలుగుదేశం వైపు మొగ్గారు. రాజశేఖరంను భారీ మెజార్టీతో గెలుపొందేలా చేశారు. ప్రాధాన్యత క్రమంలో టీడీపీ అభ్యర్థి అలవోకగా విజయం సాధించారు. మొత్తం పోలైన ఓట్లు 2,18,927 కాగా చెల్లుబాటైన ఓట్లు 1,99,208. రాజశేఖరంకు 1,24,702 ఓట్లు లభించాయి. చెల్లుబాటు ఓట్లలో 62.5 శాతం ఓట్లు టీడీపీ అభ్యర్థికే దక్కినట్టయింది. ప్రచారం, పోలింగ్ దగ్గర నుంచి కూటమి నేతలు ఉమ్మడి బాధ్య త స్వీకరించడం, క్రమపద్ధతిలో ఓటర్లను పోలింగ్ కేంద్రం వరకు వెళ్లేలా చేయడంతో టీడీపీ అభ్యర్థి రాజశేఖరంకు 77,421 ఓట్ల ఆధిక్యత లభించింది. దీనికితోడు పట్టభద్రుల నియోజకవర్గంలో టీడీపీ పక్షాన గెలిచిన ఏకైక అభ్యర్థి కూడా పేరాబత్తుల. వాస్తవానికి కౌంటింగ్ ఆరంభం నుంచి ఏదొక రౌండ్‌లో తమది పైచేయి కాకపోతుందా అని ఎదురుచూసిన పీడీఎఫ్ అభ్యర్థి వీర రాఘవులుకు నిరాశ తప్పలేదు. ప్రతీ రౌండ్‌లో రాజశేఖరం పట్టభద్రుల మద్దతు కూడగట్టుకుంటూ వచ్చారు. మొత్తం ఎనిమిది రౌండ్‌లలో ఏ ఒక్క రౌండ్‌లో రాజశేఖరంను దాటి మిగతా అభ్యర్థులెవరూ ముందుకు సాగలేకపోయారు.



రాజశేఖరానికి ధ్రువీకరణ పత్రం ఇస్తున్న ఆర్వో వెట్రిసెల్వి

కలిసొచ్చిన ఉమ్మడి కూటమి

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని కైవశం చేసుకోవాలని తొలుత నుంచి కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగానే వ్యవహరించింది. టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు అన్నిచోట్ల ఏకమయ్యాయి. ఆఖరుకు ఓట్ల నమోదు దగ్గర నుంచి ఓటర్ల జాబితా విడుదల వరకు ఏ నియోజకవర్గానికి ఆ నియోజకవర్గం నేతలే దగ్గరుండి పరిశీలించుకున్నారు. తప్పొప్పులను బేరీజు వేశారు. దీనికి సమాంతరంగా పోలింగ్ సమయంలోను తీసుకున్న జాగ్రత్తలు పేరాబత్తులకు కలిసొచ్చాయి. ఎక్కడా నిర్లక్ష్యం పాటించకుండా పట్టభద్రులను పోలింగ్ కేంద్రాలకు వెళ్ళేలా చేసి వారి మద్దతు కూడగట్టుకున్న ఫలితంగానే అభ్యర్థి రాజశేఖరంకు 77 వేల ఓట్ల ఆధిక్యత లభించింది. ఈ కారణంగానే ప్రతీ రౌండ్‌లోను తన విశ్వరూపాన్ని ప్రదర్శించారు. రాజశేఖరంకు మొదటి రౌండ్‌లో 16 వేల 520, రెండవ రౌండ్‌లో 16 వేల 212, మూడవ రౌండ్‌లో 16 వేల 191, నాల్గవ రౌండ్‌లో 15 వేల 482, ఐదవ రౌండ్‌లో 15 వేల 632, ఆరవ రౌండ్‌లో 16 వేల 254, ఏడవ రౌండ్‌లో 16 వేల 040, ఎనిమిదవ రౌండ్‌లో 12 వేల 371 మొత్తం మీద లక్షా 24 వేల 702 ఓట్లు లభించినట్టయ్యింది. దీనికితోడు నేరుగా రౌండ్ రౌండ్‌కి ఆధిక్యత ప్రదర్శించడమే కాకుండా అలవోకగా విజయాన్ని సొంతం చేసుకోగలిగారు.

పీడీఎఫ్ అభ్యర్థి వెనుకంజ

పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు ఓటర్ల మద్దతును కూడగట్టుకోలేకపోయారు. మొదటి రౌండ్‌లో 5,815, రెండో రౌండ్‌లో 5,421, మూడో రౌండ్‌లో 5,570, నాలుగో రౌండ్‌లో 6,446, ఐదో రౌండ్‌లో 6,413, ఆరో రౌండ్‌లో 5,949, ఏడో రౌండ్‌లో 5,654, ఎనిమిదో రౌండ్‌లో 5,973 ఓట్లు దక్కాయి. ఎమ్మెల్సీ పోటీలో రెండో స్థానంలో మిగిలిపోయారు. కౌంటింగ్ సమయంలో వీరరాఘవులు పక్షాన ఏజెంట్లు అభ్యంతరం వ్యక్తం చేసినా కౌంటింగ్ అధికారుల ముందు నిలవలేకపోయాయి. పీడీఎఫ్ రెండు దఫాలు ఎమ్మెల్సీ పదవి చేజిక్కించుకున్నా వీరరాఘవులు ఓటమితో హ్యాట్రిక్ ఆశలు నెరవేరకుండా పోయాయి.

సుందర్‌కు మూడో స్థానం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన 35 మంది అభ్యర్థుల్లో టీడీపీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం మొదటి, పీడీఎఫ్ అభ్యర్థి వీరరాఘవులు దక్కిన ఓట్లలో రెండో స్థానం సాధించగా మాజీ ఎంపీ హర్షకుమార్ తనయుడు జీవీ.సుందర్ మూడో స్థానం దక్కించు కున్నారు. ఆయనకు 16,183 ఓట్లు దక్కాయి. కాని మొదటి రౌండ్ నుంచి వెయ్యి ఓట్లు దాటి కొనసాగగలిగారు. మొదటి రౌండ్‌లో 1968, రెండవ రౌండ్‌లో 2,238, మూడో రౌండ్‌లో 2,119, నాలుగో రౌండ్‌లో 2,484, ఐదో రౌండ్‌లో 2,208, ఆరో రౌండ్‌లో 1741, ఏడో రౌండ్‌లో 2,106, ఎనిమిదో రౌండ్‌లో 1319 ఓట్లు దక్కాయి.

చంద్రబాబును నమ్మి గెలిపించారు



కూటమి ప్రభుత్వం 8 నెలలు పరిపాలనా కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పట్టభద్రులు నమ్మారు.. అందుకే నన్ను మెజార్టీతో గెలిపించారు. నమ్మి గెలిపించిన పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటాను. పట్టభద్రులకు నిరంతరం అందుబాటులో ఉంటాను. 40 ఏళ్ల రాజకీయ అనుభవంతో చంద్రబాబు రాష్ట్రాన్ని బాగు చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర అభివృద్ధి, యువతకు విద్య, ఉపాధి సౌకర్యాల కల్పనలో నా వంతు పాత్ర పోషిస్తాను.

- పేరాబత్తుల రాజశేఖరం

యువత సమస్యలపై పనిచేస్తా



తనను గెలిపిస్తే పట్టభద్రుల సమస్యలపై మండలిలో పోరాటం చేస్తానని ఓట్లు కోరాను. పట్టభద్రులు అవకాశం ఇవ్వలేదు. నేను బయట నుంచి యువత, నిరుద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తాను. పోలైన ఓట్లలో చాలా ఎక్కువ సంఖ్యలో చెల్లని ఓట్లు ఉన్నాయి. పట్టభద్రులలో కొంత తొట్రుపాటు, ఒత్తిడి, అవగాహన లేమి కారణం అయి ఉండవచ్చు. రానున్న కాలంలో ఓటుపై మరింత అవగాహన కల్పిస్తాను. యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఆ దిశగా కృషి చేస్తాను.

- దిడ్ల వీరరాఘవులు

ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీగా

ఆలపాటి విజయ దుందుభి

సాధించిన ఓట్లు 1,45,057.. మెజారిటీ 82,230

ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలో టీడీపీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయ దుందుభి మోగించారు. భారీ మెజారిటీతో ప్రత్యర్థిని మట్టి కరిపించారు. ఓట్ల లెక్కింపులో ఆద్యంతం తన పట్టు నిలుపుకున్నారు. తొలి రౌండ్ నుంచే ఆధికత్యత ప్రదర్శించిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ 82,230 ఓట్లతో తన సమీప పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుపై తిరుగులేని విజయం సాధించారు. ప్రతి రౌండ్‌లో ఆల పాటి రాజేంద్రప్రసాద్ భారీ మెజారిటీ సాధించారు. ఊహించినట్టుగానే ఆలపాటి రాజేంద్రప్రసాద్ భారీ మెజారిటీ మూటకట్టుకున్నారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఘన విజయంతో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు.



సీఎం చంద్రబాబును కలిసిన పేరాబత్తుల, ఆలపాటి



గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో జిల్లాలో పలు వంతెనలు నిర్మాణాలు ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. నిధులు మంజూరు కాక, కాంట్రాక్టర్లకు బిల్లుల పెండింగ్‌తో పనులు ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వమైనా ఆయా వంతెనలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

వంతెనల నిర్మాణం నత్తనడక

- ఏళ్ల తరబడి సాగుతున్న పనులు
- జల్లేరు వంతెనపై ఆగని ప్రమాదాలు
- గుండుగొలనులో మెటీరియల్ చోరీ

జల్లేరుపై భయం.. భయం..

ఏలూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలం పట్టెన్నపాలెంలో జల్లేరు వాగుపై వంతెన నిర్మాణ పనులు ఏడేళ్లుగా నిలిచిపోయాయి. తాత్కాలిక అప్రోచ్ రోడ్డుపై రాకపోకలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. 2018లో టీడీపీ ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి రూ.5కోట్లు మంజూరు చేసింది. పిల్లర్ల నిర్మాణం తర్వాత పనులు ముందుకు సాగలేదు. పనులు చేపట్టిన కాంట్రాక్టరు సబ్ కాంట్రాక్టుకు ఇవ్వడంతో బిల్లులు ఇవ్వడం లేదని సబ్ కాంట్రాక్టరు మధ్యలోనే పనులను నిలిపివేశారు. సుమారు రూ.1.80 కోట్లు పనులు పూర్తి చేయగా రూ.3.20 కోట్లు పనులు చేయాల్సి వుంది. ఆర్‌అండ్‌బీ డీఈ సీహెచ్.హరికృష్ణను వివరణ కోరగా రూ.3.20 కోట్లు మంజూరు కొరకు డిజైన్స్ అండ్ ప్లానింగ్స్ శాఖకు పంపినట్టు తెలిపారు. అనుమతిరాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

గుర్వాయిపాలెం వంతెన అప్రోచ్ లేదు!

కలిదిండి: గుర్వాయిపాలెం వంతెన అప్రోచ్ రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారడంతో తరచు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అప్రోచ్ రోడ్డుకు ఇరువైపులా రెయిలింగ్ లేక వాహనాలు అదుపు తప్పి కాల్వలో బోల్తా పడుతున్నాయి. పెదలంక, మూల్లంక, భాస్కరావుపేట, సంతోషపురం, కొత్తూరు, గుర్వాయిపాలెం పంచాయతీల పరిధిలో ప్రజలు ఈ రోడ్డుపై నుంచి నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఐదేళ్లుగా రోడ్డుకు ఇరు పక్కల రెయిలింగ్ ఏర్పాటు చేయాలని పాలకులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అప్రోచ్ రోడ్డుకు ఇరుపక్కల రెయిలింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్ అండ్‌బీ ఏఈఈ అరవింద్‌ను వివరణ కోరగా, గుర్వాయిపాలెం నుంచి పెదలంక రోడ్డు నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరయ్యాయని త్వరలో అప్రోచ్ రోడ్డుకు ఇరుపక్కల రెయిలింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

మూడేళ్ల నుంచి నిర్మాణం..!

దెందులూరు: గుండుగొలను వంతెన నిర్మాణ పనులు మూడేళ్లుగా నత్తనడకన జరుగుతున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి తోడు నిర్మాణ సామగ్రి చోరీ, కాల్వలో నీటి పారుదలతో పనులు జాప్యమయ్యాయి. ఇప్పటి వరకు వంతెన నిర్మాణం 70 శాతం పూర్తయింది. వంతెన లేక గుండగొలను, పోతునూరు, లక్ష్మీపురం, భోగాపురంతో పాటు 15 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుండుగొలను గ్రామ వెళ్లాలంటే సుమారు 600 మీటర్లు రాంగ్ రూట్‌లో వెళ్లాల్సి వస్తోంది. ఈ కారణంగా గత మూడేళ్లలో నలుగురు ప్రమాదాల బారిన పడి మృతి చెందారు. సుమారు 11 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 16 మంది గాయాల పాలయ్యారు. త్వరితగతిన వంతెన పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.





ఇంటర్ ఫస్టియర్ ఇంగ్లీష్ పరీక్షకు 1147 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన ప్రథమ సంవత్సరం ఇంగ్లీషు పరీక్షకు మొత్తం 18,991 మందికి 17,844మంది హాజరయ్యారు. 1147 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 16,374మందికి 15,641మంది, ఒకేషనల్ విభాగంలో 2617మందికి 2203 మంది హాజరయ్యారని ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు నమోదు కాలేదన్నారు.



ఆక్వా.. ఆనందం

- పెరిగిన చేపల ధర
- మేతల ధర తగ్గుముఖం

కలిదిండి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆక్వా మేత ధర తగ్గడం.. చేపల ధర పెరగడంతో రైతులు లాభాల బాటలో పయనిస్తున్నారు. గత వైసీపీ హయాంలో చేపల మేత డీవోబీ మార్కెట్‌లో పది టన్నులు ధర సుమారు రూ.2 లక్షలు ఉండగా ప్రస్తుతం సుమారు రూ.1.1 లక్షలు ఉంది. గతంలో కిలో తెల్ల చేప ధర రూ.95 ఉండగా, ప్రస్తుతం రూ.112 ఉంది. గతంలో ఎకరానికి రూ.40 వేలు నుంచి రూ.50 వేలు నష్టం వచ్చేదని, ప్రస్తుతం ఎకరానికి రూ.45 వేలు లాభం వస్తోందని ఆక్వా రైతులు చెబుతున్నారు. చేపల మేతకు ఉపయోగించే డీవోబీ తవుడును విదేశాలకు ఎగుమతి నిలుపుదలతో తక్కువ ధరకు లభిస్తున్నది. ప్రస్తుతం గిట్టుబాటు ధర లభించడంతో ఆక్వా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గిట్టుబాటు ధర లభిస్తుంది



మంతెన సుబ్బరాజు, ఆక్వా రైతు

చేపల ధర పెరగడంతో గిట్టుబాటు అవుతోంది. ఎకరాకు పెట్టుబడి పోను సుమారు రూ.40 వేలు మిగులుతోంది. గతంలో ఆక్వా మేతలు, ధరలు పెరగడం చేపల ధర తగ్గడంతో ఎకరానికి సుమారు రూ.50 వేలు నష్టపోయాం.

సబ్సిడీ విద్యుత్ అందించాలి



దున్న భోగేశ్వరరావు, ఆక్వా రైతు

ఆక్వా సాగుకు సబ్సిడీ రుణాలు, విద్యుత్ అందిస్తే రైతుకు మేలు కలుగుతుంది. ప్రస్తుతం విద్యుత్ సబ్సిడీ కొంతమంది రైతులకే వర్తిస్తున్నది. సబ్సిడీ వర్తించని రైతులకు విద్యుత్ బిల్లుల భారమయ్యాయి. ఆక్వా రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

రూ.200 కోట్లు ఆవిరి

ఐదు నెలలుగా స్టాక్ మార్కెట్ పతనం.. మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు ధమాల్

జిల్లా మదుపుదారుల్లో ఆందోళన

7

సైబర్ నేరగాళ్ల సవాల్

అమాయకులకు వల - నిండామునుగుతున్న నిరుద్యోగులు



ఉపకులపతికి ఎంవోయు అందిస్తున్న జైన్ ఇరిగేషన్ ప్రతినిధులు

ఇరిగేషన్ సిస్టంతో ఉద్యాన పరిశోధనా ప్రమాణాల్లో మార్క్

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రకు చెందిన జైన్ ఇరిగేషన్ సిస్టంతో ఎంవోయు ద్వారా ఉద్యాన పరిశోధనలో అత్యున్నత ప్రమాణాలు అందుకుంటామని ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ పేర్కొన్నారు. మహారాష్ట్ర జైన్ ఇరిగేషన్ ప్రతినిధులతో సోమవారం రాత్రి ఎంవోయు కుదుర్చుకున్నారు. గోపాల్ మాట్లాడుతూ ఈ ఇరిగేషన్ సిస్టం ద్వారా టిష్యూ కల్చర్ ల్యాబ్ సదుపాయాలు తమ పరిశోధనలకు ఉపయోగ పడతాయన్నారు. విశ్వ విద్యాలయ అధికారులు బి.శ్రీనివాసులు, వెంకటరమణ, కె.ధనుంజయ్, ఎం.మాధవి, సూర్యకుమారి, సంస్థ ప్రతినిధులు డాక్టర్ నారాయణ,విజయభాస్కర్ పాల్గొన్నారు.

డీఎన్ఆర్‌లో జిల్లాస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్



కరపత్రాలు ప్రదర్శిస్తున్న కాలేజీ యాజమాన్యం

భీమవరం రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు జిల్లాల స్థాయి 'వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025' నిర్వహించడానికి నోడల్ కాలేజీగా డీఎన్ఆర్ కళాశాలను కేంద్ర యువజన వ్యవహారాల మరియు క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఎన్నిక చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ మోజెస్ తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో 18 నుంచి 25 సంవత్సరాలు పూర్తయిన వారు పాల్గొనవచ్చని ముందుగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మైభారత్.జీవోవీ.ఇన్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.రాజ్యాంగం ద్వారా గుర్తింపు పొందిన ఏ భాషలోనైనా వాట్ డజ్ వికసిత్ భారత్ మీన్ టు యు ? అనే అంశంపై ఒక నిమిషం నిడివి కలిగిన వీడియోను వికసిత్ భారత్ లింక్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో నమోదు చేయించుకున్నవారిలో 150 మందిని స్క్రీనింగ్ చేసి వారికి డీఎన్నార్ కళాశాలలో పోటీలు నిర్వహించి పది మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారని జిల్లా యువజన అధికారి డి.కిషోర్, డీఎన్నార్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎస్. అనిల్‌దేవ్, కె.సోమయ్య తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు నమోదుకు చివరి తేదీ మార్చి 9. నమోదు ప్రక్రియలో సహాయం కోసం 81791 79899, 94413 88058 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు. నోడల్ కాలేజీగా డీఎన్నార్‌ను ఎంపిక చేసినందుకు కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు నరసింహరాజు, సెక్రటరీ, కరస్పాండెంట్ జి.సత్యనారాయణరాజు (బాబు), ఉపాధ్యక్షుడు జి.పాండురంగరాజు, పరిపాలనాధికారి పి.రామకృష్ణంరాజు అభినందనలు తెలిపారు.



నాగప్రసన్నను అభినందిస్తున్న గ్రామస్థులు

ఎస్సై ఉద్యోగం సాధించిన మహిళకు గ్రామస్థుల సత్కారం

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం సాధించిన ఆ ఊరి కోడలిని ఆ గ్రామస్థులంతా భుజాలపై మోసి సోమవారం రాత్రి ఊరేగించారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని ప్రభుత్వ కొలువులు సాధించాలంటూ గ్రామం నడిబొడ్డున సత్కారం చేశారు. తాడేపల్లిగూడెం మండలం మెట్ట ఉప్పరగూడెం గ్రామానికి చెందిన దండే నాగ ప్రసన్న ఎస్సైగా ఎంపికై శిక్షణ పూర్తిచేసుకుని అనంతపురం ఎస్సైగా బాధ్యతలు స్వీకరించడంతో ఆ గ్రామం మొత్తం ఉప్పొంగింది. తన భర్త, పిల్లలుతో కలిసి సత్కారం అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని నాగప్రసన్న ఉబ్బి తబ్బిబ్బయ్యారు. సచివాలయ మహిళా పోలీస్‌గా ఉద్యోగం చేస్తున్న తనకు ఎస్సైగా ఉద్యోగం రావడం ఆనందంగా ఉందన్నారు. టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వాడపల్లి వెంకట సుబ్బరాజు, బీజేపీ మండల కార్యదర్శి కొల్లి రాజశేఖర్, ఉప్పరగూడెం సర్పంచ్ దండే కనకబాబు, నాగ ప్రసన్న భర్త సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



గరగపర్రు శివారు పంట పొలాల్లో జాతీయ నాయకుల ఫొటోలు, జాతీయ జెండా

పంట చేలో జాతీయ స్ఫూర్తి

జాతీయ జెండా అంటే అందరికీ అభిమానమే. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజున, గణతంత్ర దినోత్సవం రోజున జెండా ఎగురవేసి పండుగను జరుపుకుంటాం. మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత జాతీయ జెండాను ప్రతి ఇంటిపై రెపరెపలాడించాలంటూ ఆదేశాలు ఇవ్వడంతో జాతీయ జెండాను ఇంటిపై ఎగురవేసి దేశభక్తిని చాటారు. పాలకోడేరు మండలం గరగపర్రు గ్రామ శివారులోని ఉన్న పంట పొలంలో ఓ రైతు జాతీయ జెండాను ఏర్పాటు చేయడమే కాకుండా జెండాకు ఇరువైపులా మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, అపర భగీరథుడు కాటన్ రతన్ టాటా చిత్రపటాలను ఏర్పాటు చేశాడు.. ఈ చిత్రపటాలను చూసిన వారంతా ఒకింత విస్మయం చెందినా రైతు చర్యను అభినందిస్తున్నారు .

-పాలకోడేరు (ఆంధ్రజ్యోతి)

గాడి తప్పిన చదువులు



వేసవి సెలవులు పూర్తికాగానే జూన్, జూలై నెలల్లో స్కూళ్లు, కాలేజీలు తెరుచుకుంటాయి. అప్పటి వరకు ఎంజాయ్ చేసిన విద్యార్థులు వారి వారి చదువుల కోసం సిద్ధం అవుతారు.. ఇదంతా సాధారణంగా ఎప్పటినుంచో కొనసాగుతున్న విద్యా విధానం కరోనా తర్వాత, గత వైసీపీ ప్రభుత్వ కాలంలో ఎన్నో మార్పులు వచ్చాయి. విద్యా వ్యవస్థ గాడి తప్పింది.ఏ కోర్సు ఎప్పుడు ప్రారంభం అనేది ప్రశ్నగా మారింది. విద్యార్థులలో గందరగోళం నెలకొంది.

విద్యా సంవత్సరం ప్రారంభం కాని తరగతులు

డిగ్రీ టు పీజీ వరకు వెనుకబాటే

నాలుగేళ్లుగా విద్యార్థులు అవస్థలు

ఇంజనీరింగ్, ఫార్మసీ, బీఈడీ, లా అన్నీ గందరగోళమే

ఈ ఏడాదైనా మారుతుందా..? విద్యార్థుల్లో ఆశ



భీమవరం రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యా విధానాలలో మార్పులు అవసరమని ప్రభుత్వం డిగ్రీ నుంచి పిజీ వరకు విద్యా తరగతుల వెనుకబాటును గాడిలో పెట్టాలని కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులు కొరుకుంటున్నారు. ఇంటర్మీడియెట్ తర్వాత ఉండే కోర్సులన్నీ విద్యా సంవత్సరం తరగతులు జరగడంతో కొన్ని నెలలు వెనక్కి వెళ్లిపోయాయి. ఏ ఒక్క కోర్సు కూడా సరైన సమయానికి మొదలు కావడం లేదు. సెమిస్టర్ విధానంగా సాగే పరీక్షలు వెనక్కు వెళ్లిపోయాయి. దీంతో విద్యార్థులలో చేరిక, కోర్సు పూర్తి చేసుకుని బయటకు వచ్చే సమయాలు తారుమారు అవుతున్నాయి. ప్రభుత్వం విద్యా సంవత్సరం ఆరంభం నుంచే తరగతుల ప్రారంభంపైన దృష్టి పెట్టవలసిన అవసరం ఉంది.

బీఈడీ బాగా వెనక్కి

బీఈడీ కోర్సు విద్యా సంవత్సరం ప్రారంభం బాగా వెనక్కి వెళ్లింది. 2024-26 విద్యా సంవత్సరం 2024 జూన్- జూలై నెలలో ప్రారంభం అవ్వాలి. అలాంటిది 2025 జనవరి చివరిలో విద్యా సంవత్సరం తరగతులు మొదలయ్యాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 13 బియిడి కళాశాలల్లో అడ్మిషన్లు బాగా ఉన్నప్పటికీ తరగతులు వెనక్కి వెళ్లడం విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. ఒక సెమిస్టర్ సమయం వెనక్కి వెళ్ళిపోయింది.

ఇంజనీరింగ్ అంతే..

ఇంజనీరింగ్‌లో చేరే విద్యార్థులకు అడ్మిషన్ కోసం ఎప్పుడు ఎదురుచూపులే. ఎంట్రెన్స్ టెస్ట్ ఏపీ ఈఏపీ సెట్ మే నెలలో జరుగుతుంది. రెండు వారాల్లోనే ఫలితాలు వచ్చేస్తున్నాయి. అయితే కౌన్సెలింగ్, సీట్ల ఎలాట్‌మెంట్‌లో జాప్యం చేస్తున్నారు. దీంతో జిల్లాలో 15 ఇంజనీరింగ్ కళాశాలల్లో చేరేందుకు ఉన్న దాదాపు 10 వేల మంది విద్యార్థులు ఎదురు చూడాల్సి వస్తుంది. గత ఏడాది సెప్టెంబర్ నెలలో తరగతులు మొదలయ్యాయి.

పీజీ కోర్సులు ఆలస్యమే

డిగ్రీ పూర్తి చేసుకుని పీజీలో చేరేందుకు ఎంట్రెన్స్ పరీక్షలు రాసి సిద్ధంగా ఉన్న విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ప్రతి ఏటా నాలుగు నెలలు వెనక్కి విద్యా సంవత్సరం వెళ్ళిపోతోంది. ఉమ్మడి జిల్లాలో పది వరకు పీజీ కోర్సుల కళాశాలలు ఉన్నాయి. వాటిలో 3 వేలకు పైగా విద్యార్థులు ఉంటున్నారు. వారు ప్రథమ సంవత్సరం విద్యా తరగతుల ప్రారంభం అక్టోబర్ నెలలో గాని కావడం లేదు.

2021 నుంచి డిగ్రీలోనూ వెనుకబాటు

ఇంటర్ పూర్తి చేసుకుని ఫలితాలు ఏప్రిల్ నెలలోనే తెలుసుకునే విద్యార్థులు డిగ్రీ చేరిక ఆలస్యం వారిలో నిరుత్సాహానికి దారితీస్తుంది. డిగ్రీలో చేరే విద్యార్థులు ఆన్‌లైన్ చేరిన విధానం వచ్చాక వెనుకబాటు తప్పడం లేదు. 2020-21 సంవత్సరం నుంచి గత ప్రభుత్వం ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు తీసుకువచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు సెప్టెంబరు, అక్టోబరు నెలలోనే తరగతులు ప్రారంభమవుతున్నాయి.

లా కళాశాల అడ్మిషన్లూ అంతే..

లా విద్యా విధానంలోను అదే తీరు. ఈ ఏడాది విద్యా తరగతులు మరీ వెనక్కి వెళ్లాయి. జిల్లాలో ఒకే లా కళాశాల ఉంది. దానిలో 2024 విద్యా సంవత్సరం తరగతులు ఈ ఏడాది మొదలయ్యాయి. కౌన్సెలింగ్, సీట్ల ఎలాట్‌మెంట్ ఆలస్యంగా సాగడంతో తరగతుల ప్రారంభంలో కూడా జాప్యం చోటు చేసుకుంది.

ఎంట్రెన్స్ పరీక్షలన్నీ ముందే.. అడ్మిషన్లు వెనక్కి

పీజీ సెట్‌లు, పాలిసెట్, లా సెట్, ఏపీఈఏపీ సెట్ ఇలాంటి ఎంట్రన్స్ పరీక్షలన్నీ ఏప్రిల్, మే నెలలో నిర్వహిస్తున్నారు.ఫలితాలు రెండు, మూడు వారాల్లో ఇచ్చేస్తున్నారు. అయితే అడ్మిషన్ ప్రక్రియ మాత్రం నెలలు వెనక్కి నెట్టేస్తున్నారు. దీనిమూలంగా విద్యార్థులు నెలల తరబడి ఇంటి వద్ద వేచిచూడాల్సి వస్తున్నది.

ఫార్మసీ కోర్సు మరింత ఆలస్యం

ఫార్మసీలో చేరాలనుకునే విద్యార్థులు గడిచిన నాలుగేళ్లుగా తరగతులు ఆలస్యంతో ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. ఈ 2024 విద్యా సంవత్సరంలోను అదే తీరు సాగింది. ఎంట్రెన్స్ పరీక్ష ఫలితాలు వచ్చిన ఐదు నెలలకుగాని తరగతులు ప్రారంభం కాలేదు. ఉమ్మడి జిల్లాలో 12 ఫార్మసీ కళాశాలలు 1200 గ్రేడ్లు ఉన్నాయి. సీట్ల భర్తీ బాగుంటుంది. అయితే తరగతులు ప్రారంభం డిసెంబర్ నెలలో అయ్యాయి. దీంతో విద్యార్థులు వేరే కోర్సుకు వెళ్లాలా ఫార్మసీలో చేరాలా అనే ఆలోచనలతో ఉండాల్సి వచ్చింది.

పీజీ కోర్సులు ఆలస్యంతో ఇబ్బందులు



పీజీ కోర్సుల తరగతులు ప్రారంభం ఆలస్యంగా సాగుతున్నాయి. జూలై నెలలో ప్రారంభం అవ్వాల్సిన తరగతులు అక్టోబరు నెలలో మొదలవుతున్నాయి. దీంతో విద్యార్థుల సెమిస్టర్ విధానం ఇబ్బందిగా మారుతోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి సరైన సమయానికి తరగతులు మొదలయ్యేలా ప్రభుత్వం ఆలోచిస్తున్నది.

-టి.రామ్మూర్తి, కేజీఆర్ఎల్ పీజీ కళాశాల డైరెక్టర్

వృక్ష విలాపం

నేలకొరుగుతున్న వనాలు

కుక్కునూరు మండలంలో ఇష్టారాజ్యంగా చెట్లు నరికివేత

పట్టించుకోని అటవీ, రెవెన్యూ శాఖ

కుక్కునూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరు మండలంలో అడవులను ఇష్టారాజ్యంగా నరికివేస్తున్నారు. పట్టించుకోవాల్సిన అటవీ, రెవెన్యూ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. కుక్కునూరు, అమరవరం అటవీ రేంజ్ పరిధిలో ఉన్న అటవీప్రాంతం ఒకప్పుడు కీకారణ్యం. పోడుభూముల సాగుపేరుతో వేలాది ఎకరాలు సాగవుతుండగా ఇప్పుడు మిగిలి ఉన్న అడవి కూడా స్మగ్లర్ల వేటుకు బలైపోతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే అడవే కనుమరుగయ్యే పరిస్థితి లేకపోలేదు.

అటవీశాఖ ద్వారా పెంపకం జరుగుతున్న జామాయిల్ నర్సరీలో ఉన్న చెట్లును, మారుజాతి చెట్లను స్మగ్లర్లు నరికివేస్తున్నారు. ఇటీవల అమరవరం అటవీరేంజ్ పరిధిలో బర్లమడుగు జామాయిల్ నర్సరిలో దాదాపు 40కి పైగా జామాయిల్ చెట్లు నరికి వేసినట్లు రాజమండ్రి స్క్వాడ్ సిబ్బంది గుర్తించారు. అలాగే కుక్కునూరు అటవీరేంజ్ పరిధిలో మారేడుబాక నర్సరీలో జామాయిల్ చెట్లు నరికివేసి ఓ స్మగ్లర్ తరలిస్తున్న సమయంలో స్థానిక అటవీసిబ్బంది పట్టుకుని అపరాధ రుసుం వసూలు చేశారు. జామాయిల్ చెట్లు నరికి వేయడంతో పాటు మారుజాతి చెట్లు నరికివేసి వాటిని సైజులుగా మార్చి భద్రాచలం పేపర్‌బోర్డుకు తరలించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటు న్నారు. కొందరు అటవీసిబ్బంది స్మగ్లర్లతో సన్నిహితంగా ఉంటున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. అమరవరం అటవీరేంజ్‌లో జామాయిల్ నర్సరీలు సాగు చేసే ప్రాంతంలో రిజర్వ్‌ఫారెస్ట్ భూముల్లో కొందరు అక్రమంగా నర్సరీలు ఏర్పాటు చేస్తూ కొత్తగా బోర్లు వేస్తున్నా అటవీ సిబ్బంది పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్ర స్థాయి విజిలెన్స్ తనిఖీలు జరిపితే నిజాలు బయటపడే అవకాశం ఉంది.

రెవెన్యూ పరిధిలో ఉన్న భూముల్లో చెట్లు నరికివేత

వేలేరు పంచాయతీలో లక్ష్మీనరసింహస్వామి గుట్టగా పేరొందిన రెవెన్యూ భూమిలో ఉన్న చెట్లను కూడా ఇటీవల కొందరూ ఆక్రమించుకుని అందులో ఉన్న చెట్లను నరికి వేస్తున్నారు. దాదాపు 2 వేల ఎకరాల్లో ఉన్న రెవెన్యూ భూముల్లో ఇప్పటికే చాలా భూమిని ఆక్రమించినట్లు సమాచారం. ట్రీ కటింగ్ మిషన్లు ఉపయోగించి యథేచ్ఛగా చెట్టు నరికివేస్తున్నా రెవెన్యూ సిబ్బంది మాత్రం పట్టించుకోవడం లేదు. ఇంత భూ అక్రమాలు జరుగుతున్న రెవెన్యూ సిబ్బంది ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై కొందరు ఏలూరు జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. వందలాది చెట్లు నేల కొరుగుతున్నా ముడుపుల మత్తులో సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అమరవరం అటవీ రేంజ్ పరిధిలో మారుజాతి చెట్టు మోడు



వేలేరు గ్రామ శివారుల్లో రెవెన్యూ భూమిలో నేలకొరిగిన జామాయిల్ చెట్లు

ఉత్సవాల కలప ఏమవుతోంది ?

పట్టిసీమ శివరాత్రి ఉత్సవాలకు ఏటా అడవుల నరికివేత

అంతరిస్తున్న పాపికొండల సహజ వనాలు



పోలవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ మహా శివరాత్రి ఉత్సవాల పేరిట ఏటా అడవుల నరికివేత వల్ల పాపికొండల అభయారణ్యంలో సహజ వనాలు నశిస్తున్నాయని ప్రకృతి వన ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా పట్టిసీమ మహా శివరాత్రి ఉత్సవాలకు ఫెర్రీ రేవు టికెట్ కౌంటర్ల నుంచి నదీ తీరం వరకూ అక్కడి నుంచి ఇసుక తిన్నెల్లో ఆలయ ప్రాంగణం వరకూ వేసిన చలువ పందిళ్ళు స్నానాల రేవుల బారికేడ్లు, దుస్తులు మార్చుకునే గదులు వేయడానికి ఉత్సవ కమిటీ ఛైర్మన్ జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఇతర అధికారుల అభ్యర్థన మేరకు అటవీశాఖ అధికారులు ఉత్సవ సమీక్షా సమావేశంలో ఐదువేల కర్రలు ఇవ్వడానికి అంగీకరించారు. కలప నిమిత్తం 1,19,600 రూపాయల రుసుం అటవీశాఖకు చెల్లించే విధంగా వింజరం సెక్షన్ పరిధిలో 14 ట్రాక్టర్లు, పోలవరం సెక్షన్ పరిధిలో 20 ట్రాక్టర్లతో కలప తరలింపునకు అనుమతి ఇచ్చి కలప తరలించారు. ఆ కలపను పోలవరం రిజర్వు ఫారెస్టు నుంచి సున్నాలగండి గ్రామానికి ఎగువన నరికించి 34 లోడ్లు వెదురు కర్రలు, వెదురు కంప, వెదురు తడికల రూపంలో సుమారు 24 వేల కర్రలను తరలించారు. ఉత్స వాల అనంతరం ఆ కలపను అటు దేవస్థానానికి గానీ, పంచాయతీకి గానీ మరుసటి ఉత్సవాల నిర్వహణ కోసం అప్పగించాల్సి ఉంది. అయితే ఆ కలపను ఫెర్రీ పాటదారులు, స్థానిక నాయకులు ఇతర ప్రాంతాలకు అమ్మి సొమ్ము చేసుకున్నారు. ప్రతి ఏటా ఇదే విధంగా కలప నరికించి తరలించి ఉత్సవాల అనంతరం ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఉత్సవాల పేరిట ఏటా ఇలా అడవులను నరకడం వల్ల ప్రకృతి వనాలు ధ్వంసమై వన్యప్రాణులు మైదాన ప్రాంతాలకు తరలి వస్తున్నాయి. ఒకసారి నరికి తెచ్చిన కలప కనీసం పది సంవత్సరాల వరకూ చలువ పందిళ్ళు, బారికేడ్లు, ఇతర అవసరాలకు ఉపయోగపడుతుంది. కానీ ఉత్సవాల పేరిట ప్రతియేటా అధికారులే రిజర్వు ఫారెస్టులో వెదురు, కలప తీసుకెళ్ళడానికి అనుమతులు ఇస్తుండడంతో అదే అదనుగా భావించిన పాటదారులు, దళారులు అనుమతుల ముసుగులో అవసరానికి మించి, అనుమతులకు మించి కలప వెదురు తరలించి సొమ్ములు చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి ఉత్సవాల పేరిట అక్రమ కలప రవాణాను అరికట్టాలని, ఉత్సవాలకు తరలించే కలపను మళ్లీ ఏడాది ఉత్సవాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ప్రకృతి వన ప్రేమికులు కోరుతున్నారు.

ముందస్తు ప్రణాళిక

వేసవి పనులకు ప్రతిపాదనలు


మార్చి మాసాంతంలోగా మంజూరు

జలవనరుల శాఖలో కదలిక

కూటమి రాకతో మార్పు స్పష్టం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జలవనరుల శాఖ ముందుగానే మేల్కొంది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తప్పులను సరిదిద్దు కుంటోంది. వేసవి పనులకు ముందుగానే ప్రతిపాదనలు పంపింది. ప్రభుత్వం ఈ నెలాఖరుకు అనుమతులు మంజూరు చేయనుంది. టెండర్‌లు పిలిచి పనులు చేపట్టేలా జిల్లా అధికారులు ప్రణాళిక చేసుకున్నారు. పంట కాలువలు, డ్రెయిన్‌ల ప్రక్షాళనకు చర్యలు తీసుకుంటు న్నారు. సాగు నీరు, డ్రైనేజీ శాఖలు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు పంపాయి. సాగునీటి శాఖలో 400 పనులు చేపట్టనున్నారు. ఇందు కోసం రూ.19 కోట్లు అవసరం కానుందని అంచనా వేశారు .ఇక డ్రైనేజీలో 382 పనులు చేపట్టేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పశ్చిమ డెల్టా పరిధిలోని డ్రెయిన్‌లకోసం దాదాపు రూ.17.73 కోట్లు వ్యయం కానుంది. మొత్తంపైన పశ్చిమ డెల్టా పరిధిలో రూ.34 కోట్ల విలువైన పనులకు అంచనాలు రూపొందించారు. ప్రభుత్వ ఆమోదానికి ప్రతిపాదనలు పంపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జలవనరుల శాఖలో కదలిక వచ్చింది. అసెంబ్లీ సమావేశాల్లోనూ ప్రజాప్రతినిధులు పశ్చిమ డెల్టా కాలువలు, డ్రెయిన్‌ల దుస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతున్నారు. జిల్లాలోనే జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఉండడంతో అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. దానికితోడు కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోంది. అందులో భాగంగానే కాలువలు, డ్రెయి న్‌లను మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించింది. ఈ ఏడాది పెద్దమొత్తంలో పనులు నిర్వహించడానికి కార్యాచరణ రూపొందించారు.




పూడుకుపోయిన డ్రెయిన్లు

గత ఐదేళ్లలో జలవనరులశాఖ గడ్డు పరిస్థితి ఎదుర్కొంది. నిధులు లేవు. పనులు చేపట్టలేదు. కాంట్రాక్టర్లు ముఖం చాటేశారు. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయలేదు. కాలవల్లో కర్రనాచు తొలగించలేని దుస్థితి. డ్రెయిన్‌లలో పిడికెడు మట్టి తొలగించలేక పోయారు. దీంతో డ్రెయిన్‌లు పూడుకుపోయాయి. నీటి ప్రవాహానికి అవరోధంగా మారాయి. వర్షాలుకురిస్తే డ్రెయిన్‌లు ఎగదన్ని పంట పొలాలు ముంపు బారిన పడుతున్నాయి. కాలువలు సక్రమంగా లేకపోవడంతో వర్షాకాలంలోనూ శివారు ప్రాంతాలకు సాగునీరు అందడం లేదు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం పశ్చిమ డెల్టా పరిధిలో కాలువలు, డ్రెయిన్‌ల ఆధునికీకరణ కోసం బడ్జెట్‌లోనూ పెద్దమొత్తంలో నిధులు కేటాయించింది. ఉభయగోదావరి జిల్లాలకు రూ. 200 కోట్లు కేటా యించడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. తాజాగా ఓ అండ్ ఎం నిధుల విషయంలోనూ ఈ ఏడాది దాదాపు రూ. 37 కోట్ల విలువైన పనులకు పశ్చిమడెల్టా నుంచి ప్రతిపాదనలు పంపారు.

నీటి తీరువాతోనే సమస్య

రైతులు చెల్లించే నీటి తీరువాతోనే ప్రభుత్వం ప్రతి ఏటా వేసవిలో ఓఅండ్ఎం పనులకు నిధులు కేటాయిస్తుంది. జిల్లాలో నీటి తీరువా బకాయిలు పేరుకుపోయాయి. రెవెన్యూ అధికారులు నిధులను సైతం పక్కదారి పట్టించారు. క్షేత్రస్థాయిలో కొందరు వీఆర్‌వోలనే అక్రమాలకు పాల్పడ్డారు. రైతులు చెల్లించే నీటితీరువాను ప్రభుత్వానికి జమ చేయలేదు. ఇలా జిల్లాల్లో కొన్నేళ్ల నుంచి బకాయిలు పెండింగ్‌లో ఉండిపోయాయి. దానిని హేతుబద్ధీకరించడానికి రెవెన్యూ శాఖ మల్లగుల్లాలు పడింది. అయినా సరే ఇప్పటికీ బకాయిలు సక్రమంగా వసూలు చేయడం లేదు. రైతుల నుంచి పన్ను జమ అయితేనే ప్రభుత్వానికి నిధులు కేటాయించే అవకాశం ఉంటుంది. కూటమి ప్రభుత్వంలో జలవనరుల శాఖకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఫలితంగా ఈ ఏడాది నిధులకు ఇబ్బంది ఉండదన్న నమ్మకంతో అధికారులు పనులకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ అనుమతుల కోసం ఎదురుచూస్తున్నారు.

మైపలో సాగు నీటి ఇబ్బందులు



మోగల్లులో బీటలువారిన పొలం

పాలకోడేరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మైప గ్రామంలో సాగునీటి ఇబ్బందులతో రైతులు నానా పాట్లు పడుతున్నారు. శివారు గ్రామమైన మైప గ్రామానికి అత్తిలి మండలం స్కిన్నెరపురం బ్రాంచ్ ద్వారా తాగు, సాగు నీరు వస్తుంది. స్కిన్నెరపురం బ్రాంచ్‌ను చేర్చి రొయ్యల చెరువులు ఉండటంతో ఆ కాలువ ద్వారా వచ్చే నీటిని చేపలు, రొయ్యల చెరువుల రైతులు అడ్డంగా తోడేసుకోవడంతో పంట పొలాలకు సాగు నీరు అందని పరిస్థితి ఏర్పడింది. ఇంజన్ల ద్వారా, కారెంల ద్వారా నీటిని తోడుకుందామన్నా ఆ పంట బోదెలో సాగునీరు ఉండడం లేదు. పంట పొలాలు చూస్తే పొట్ట దశలోకి వచ్చాయి. ఈ పరిస్థితుల్లోనే పొలాలకు పుష్కలంగా నీరు అందడం లేదు. అటువంటి తరుణంలో పంట పొలాల్లో నీరు లేక నెర్రలు తీసి సాగునీటి కోసం పంట పొలాలు చూస్తున్నాయి. మూడో కోటా కింద పంట పొలాల్లో మందు వేస్తే గాని పంట పొలాలు ఈనే పరిస్థితి ఉండదని రైతులు అంటున్నారు. అధికారులకు తెలియపరిచినా పట్టించుకోవడం లేదని రైతులు లబోదిబోమంటున్నారు.

సాగునీరందించాలి


రైతే దేశానికి వెన్నెముక అంటారు. అటువంటి రైతును ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేదు. సాగు నీరందించండి అని వేడుకున్నా రైతు మాటలను లెక్క చేయడం లేదు. రైతు బతకాలంటే నీరందించాలి. నీరు అందితేనే పంట పొలాలు పండుతాయి. నీరందించి రైతును ఆదుకోవాలి.

- కనుమూరి వెంకట సత్యనారాయణరాజు, మైప గ్రామ రైతు

ఎస్సీల పేరుతో నకిలీల ఆటలు చెల్లవు

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

కాళ్ళ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఎస్సీలమంటూ చెప్పుకుంటూ సామాన్యులపై తప్పుడు కేసులు పెడుతున్న నకిలీల ఆటలు ఇక చెల్లవని, అటువంటి వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు తెలిపారు. కాళ్ళ మండలం పెద అమిరంలోని ఆయన క్యాంపు కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏలూరుపాడు గ్రామానికి చెందిన కోన జోసెఫ్ అలియాస్ ఏసేపు అనే వ్యక్తి తప్పుడు ఎస్సీ సర్టిఫికెట్ పొంది ఏలూరుపాడు చుట్టుపక్కల గ్రామాల్లో పలు ఎస్సీ, ఎస్టీ కేసులు పెడుతున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. సదరు జోసఫ్ ఆకివీడు మండలం దుంపగడప కాలేజీలో ఇంటర్మీడియట్ చదివినప్పుడు క్రిస్టియన్‌గా నమోదై ఉన్నాడని, అదేవిధంగా ఏలూరుపాడు గ్రామంలో క్రిస్టియన్ శ్మశానమందు జోసెఫ్ తల్లిదండ్రులు, బంధువుల సమాధులు ఉన్నాయన్నారు. అంతే కాకుండా ఏలూరుపాడు సీఎస్ఐ చర్చి ఫౌండేషన్ సభ్యులుగా ఉంటూ తాను ఎస్సీ అంటూ పలువురు అమాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టారని గ్రామస్తులు తెలిపారన్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. 2023 జూలై 18వ తేదీన కాళ్ళ తహసీల్దార్ జారీ చేసిన ఎస్సీ సర్టిఫికెట్ నంబర్ సిజిసి 2307174069547 రద్దు పరచినట్లు మార్చి 3వ తేదీ సాయంత్రం జిల్లా కలెక్టర్ నుంచి రాజపత్రం విడుదల చేసినట్లుగా ఆయన స్పష్టం చేశారు. ఇకపై ఎవరైనా తప్పుడు ఎస్సీ సర్టిఫికెట్లతో దందాలు చేస్తే ఊరుకునేదే లేదన్నారు. అటువంటి ఫేక్ వ్యక్తుల వల్ల నిజమైన ఎస్సీలు న్యాయం పొందలేకపోతున్నారని ఆయన తెలిపారు.


పశ్చిమగోదావరి జిల్లా రాజపత్రం
THE WEST GODAVARI DISTRICT GAZETTE
అసాధారణ అనుబంధము
EXTRA ORDINARY
అధికారంక్రింద ప్రచురణ
PUBLISHED BY AUTHORITY

No.07. MONDAY DATE 03-03-2025

Proceedings of the Dist Collector, W.G.Dist., Rc.No.1937400/Magl/2024, Dt.01.03.2025.

NOTIFICATION

In view of the recommendations of the District Level Scrutiny Committee and in exercise of the powers conferred under Section 5(1) of the Andhra Pradesh (Scheduled Caste, Scheduled Tribe and Backward Classes) Regulations of Issue of Community, Nativity and Date of Birth Certificate Act 1993 (Act No.16 of 1993) r/w with rule 9(7) of the Andhra Pradesh Scheduled Castes, Scheduled Tribes and Backward Classes- Issue of Community, Nativity and Date of Birth Certificate Rules, 1997 communicated with G.O.Ms.No.58 Social Welfare(J) Department Dated:12.05.1997 the Scheduled Caste Certificate issued to Sri Kona Joseph alias Yoseph with certificate bearing No.COC2307174069054, Dated 18.07.2023 issued by Tahsildar, Kalla is hereby cancelled with immediate effect.

Sd/- C. Nagarani, I.A.S.,
District Collector,
West Godavari, Bhimavaram

కలెక్టర్ విడుదల చేసిన రాజపత్రం

30 గంటలు

సుదీర్ఘంగా ఎమ్మెల్సీ ఓట్ల కౌంటింగ్
30 గంటల తర్వాత ఫలితం ప్రకటన
ముగిసిన ఎన్నికల కోడ్

ఏలూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజక వర్గ ఓట్ల లెక్కింపు కార్యక్రమం సుదీర్ఘంగానే కొనసాగింది. సోమవారం ఉదయం ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాల ప్రాంగణంలో 8 గంటలకు ప్రారంభమైన లెక్కింపు ప్రక్రియ మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు గెలిచిన కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి ఎన్నిక ధృవీకరణ పత్రం ఆర్వో కె.వెట్రిసెల్వి అందజేతతో ముగిసింది. 456 పోలింగ్ కేంద్రాల వారీగా స్ట్రాంగ్ రూమ్ నుంచి బ్యాలెట్ బాక్సులను తీసుకువచ్చి, వాటిని కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన 28 టేబుల్స్‌పై వేసి కట్టలు కట్టే కార్యక్రమం ఏకబిగిన 12 గంటల పాటు సాగింది. ఉద్యోగ సిబ్బంది మూడు షిఫ్టుల్లో ఈ ప్రక్రియను చేపట్టారు. కట్టలు కట్టే కార్యక్రమం అన్ని టేబుల్స్‌పై ఒకే రీతిన సాగలేదు. దీంతో రౌండ్ రౌండ్‌కు అంతరం పెరిగి ఆలస్యం చోటు చేసుకుంది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఓట్లను 50 చొప్పున విభజించి కట్టలు కట్టే పనే సాగింది. అనంతరం 8.30 గంటలకు ఓట్ల లెక్కింపు తొలి రౌండ్ ప్రారంభం అయింది. అయితే ఓట్ల లెక్కింపులో అంకెలు, సరైన ఓట్లనే చెల్లనిగా ప్రకటించారంటూ ఏజెంట్లు పదేపదే అభ్యంతరాలు చెప్పడంతో తొలి రౌండ్ ఫలితం ఆలస్యంగా రాత్రి 12.30 గంటలకు విడుదల చేశారు. అధికారులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. కూడా ప్రతీ ఓటును ఏజెంట్‌కు క్షుణ్ణంగా చూపించాల్సి రావడంతోనే జాప్యం చోటు చేసుకుంది. రాత్రి 3 గంటలకు రెండో రౌండ్ ఫలితం రాగా, 5 గంటలకు మూడో రౌండ్, 7 గంటలకు నాలుగో రౌండ్, 9 గంటలకు ఐదో రౌండ్, 11 గంటలకు ఆరో రౌండ్, మధ్యాహ్నం 1 గంట దాటాక 6 రౌండ్ ఫలితం విడుదలయ్యింది. ఇక్కడే పేరాబత్తుల రాజశేఖరం విజయం ఖరారైంది. చివరగా కొన్ని టేబుల్స్‌పైన ఓట్ల లెక్కింపును మధ్యాహ్నం 2 గంటలకు పూర్తి చేశారు.


ఓట్ల స్లిప్పులను కట్టలుగా కడుతున్న కౌంటింగ్ సిబ్బంది


ఎన్నికలు సక్సెస్ కావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, ఇతర అధికారులు

అధికారులకు అభినందనలు

ఎమ్మెల్సీ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయడంలో అందరూ అధికారులు అద్భుతంగా పనిచేశారని, అత్యంత నైపుణ్యంతో శాంతియుతంగా చేయడం అభినందనీయమని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి అన్నారు. ఆరు జిల్లాల యంత్రాంగం అందించిన సహకారం మరువలేనిదని, పోలీస్ యంత్రాంగం బాగా పనిచేసిందన్నారు. ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొని తమవంతు పాత్ర పోషించారన్నారు.

ఎన్నికల కోడ్ ఎత్తివేత

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు సజావుగా, ప్రశాంతంగా ముగియడంతో ఎన్నికల నిర్వహణ జరిగిన ప్రాంతాల్లో ఎన్నికల కోడ్‌ను ఎత్తివేస్తూ రాష్ట్ర చీఫ్ ఎన్నికల అధికారి వివేక్‌యాదవ్ మంగళవారం ఉత్తర్వులు సాయంత్రం జారీ చేశారు. ఇక వివిధ విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగిపోనున్నాయి. అధికారిక కార్యక్రమాలు, పర్యటనలు సాగుతాయి. కౌంటింగ్ ప్రక్రియతో సోమవారం మూతపడిన మద్యం దుకాణాలు, బార్‌లు కూడా సాయంత్రం సీళ్లను తొలగించడంతో యధావిధిగా పనిచేశాయి.



ముచ్చట గొలిపే ఆవు దూడ

భీమవరంలో అడుగు ఎత్తు ఆవు దూడ జననం

భీమవరం టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : పుంగనూరు ఆవు ప్రత్యేకత ఏమిటంటే ఎత్తు సుమారు 1.5 నుంచి 3 అడుగుల మధ్యే ఉంటుంది. భీమవరం గునుపూడిలోని పురోహితుడు వేలూరి రామకృష్ణ గోశాలలో నందిని అనే ఆవుకు మంగళవారం అడుగు ఎత్తు ఉన్న గిత్త దూడ పుట్టింది. ఒక్క అడుగు ఎత్తుతో చూడముచ్చటగా కనిపిస్తున్నది. పుంగనూరు ఆవులు మామూలు ఆవు దూడల సైజులో ఉన్నప్పటికీ కాళ్లు పొట్టిగా ఎత్తు 70 నుంచి 90 సెంటీమీటర్లు ఉంటాయి. ఈ దూడను జిల్లా పశు వైద్యాధికారి మురళీకృష్ణ పరిశీలించి టీకాలు వేశారు.

రూ.200 కోట్లు ఆవిరి!

ఐదు నెలలుగా స్టాక్ మార్కెట్ పతనం
మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టిన పెట్టుబడులు ఢమాల్..
మదుపుదారుల్లో ఆందోళన



నరసాపురం, మార్చి4 (ఆంధ్రజ్యోతి): ఐదు నెలలుగా స్టాక్ మార్కెట్ పతనం జిల్లా మదుపుదారులపై భారీ ప్రభావాన్ని చూపింది. రూ.200 కోట్లపైనే సంపద ఆవిరైనట్లు అంచనా వేస్తున్నారు. అత్యధికంగా స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టిన మదుపుదారుల సంపద తరిగిపోయింది. ఇటు మ్యూచివల్ ఫండ్స్ పరిస్థితి ఇదే విధంగా ఉండటంతో వాటిల్లో సొమ్ము దాచుకున్న వారి సంపద కూడా ఆవిరైంది. దీంతో మదుపుదారుల్లో ఆందోళన నెలకొంది. గతంలో అమెరికాలో తలెత్తిన ఆర్థికమాంద్యం, కొవిడ్ సమయాల్లో కూడా ఇలాంటి పతనాన్ని జిల్లా మదుపుదారులు చవిచూశారు. అయితే ఈ స్థాయిలో నష్టపోలేదు. రోజురోజుకు ఇండెక్స్ కిందికి పడిపోవడంతో ఉన్న సంపద కూడా ఆవిరైపోతుందన్న భయం మదుపుదారుల్లో నెలకొంది. దీంతో కొందరు అయినకాడికి అమ్ముకుని నష్టాలను మూటగట్టుకున్నారు. తిరిగి మార్కెట్ ఎప్పుడు కొలుకుం టుందో తెలయని పరిస్థితి నెలకొనడంతో పెట్టుబడులు పెట్టలేక స్తబ్దుగా ఉండి పోతున్నారు. రాష్ట్రంలోనే పశ్చిమకు స్టాక్ మార్కెట్ పెట్టుబడుల్లో ప్రత్యేక స్థానం ఉంది. భీమవరం, తణుకు, టీపీగూడెం, నరసాపురం వంటి ప్రధాన ప్రాంతాల్లో అత్యధికమంది మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతుంటారు. ఇటు బ్యాంకు వడ్డీ రేట్లు తగ్గిపోవడం, రియల్ ఏస్టేట్ కూడా లాభకరంగా లేకపోవడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇటీవల కాలంలో మ్యూచ్‌వల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెడుతూ వచ్చారు. ఈకారణంగా గడిచిన నాలుగేళ్ళల్లో జిల్లా స్టాక్ మార్కెట్ డీమ్యాట్ ఖాతాల సంఖ్య కూడా పెరిగింది. ఇటు మ్యూచ్‌వల్ ఫండ్స్‌లో పెట్టుబడులు కూడా ఊహించని విధంగా పెరిగింది. గడిచినా నాలుగేళ్ళల్లో స్టాక్ మార్కెట్ దూసుకుపోవడంతో వీరంతా భారీ లాభాలను రుచి చూశారు. భారత్ ఆర్థిక పరిస్థితి స్థిరంగా ఉందన్న నమ్మకంతో చాలామంది మదుపుదారులు లాభాలు వచ్చినా వెనక్కి తీసుకోలేదు. దీంతో లాభంతో పాటు పెట్టిన పెట్టుబడులు కూడా ఆవిరైపోయాయి. ఈ కారణంగానే అత్యధికంగా నష్టాలను మూటగట్టుకున్నారు. ట్రంప్ రాకతో ట్రేడ్ వార్ పరిస్థితులు అంతర్జాతీయంగా నెలకొన్నాయి. ఇటు దీర్ఘకాల పెట్టుబడుల లాభాలపై కేంద్రం అమలు చేసిన లాంగ్ టర్మ్, షార్ట్ టర్మ్ పన్నుల భయంతో విదేశీ పెట్టుబడుదారులు అయినకాడికి అమ్మేస్తున్నారు. ఇది కూడా మార్కెట్ పతనానికి మరో కారణంగా నిలిచింది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఉన్న పెట్టుబడులైనా మిగులుతాయా ? లేక ఆవరైపోతాయన్న భయం జిల్లా మదుపుదారుల్లో నెలకొంది.

రాజశేఖరం గెలుపు కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం : కేంద్ర మంత్రి వర్మ



భీమవరంటౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం భారీ మెజార్టీతో విజయం సాధించడం పట్ల కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయక మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ హర్షం వ్యక్తం చేశారు. రాజశేఖరం ఘన విజయానికి కృషిచేసిన పట్టభద్రులకు,టిడిపి, జనసేన, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు, ప్రతిఒక్కరికీ కృతజ్ఞ తలు తెలిపారు. పట్టభద్రులు ఏ ఆకాంక్షల కోసమైతే కూటమి అభ్యర్థిని గెలిపించారో వాటి సాధనకు ఎన్డీయే ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా డబుల్ ఇంజిన్ సర్కార్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు యువత సంపూర్ణ మద్దతు తెలిపిందనడానికి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల స్థానంలో ఆలపాటి రాజేంద్ర, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల స్థానం నుంచి రాజశేఖరంలు తొలి ప్రాధాన్యత ఓట్లతో భారీ మెజార్టీతో గెలుపొందటమే నిదర్శనమని అన్నారు.

భక్తురాలి మెడలో బంగారు హారం మాయం

ద్వారకాతిరుమల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న దర్శనానికి వచ్చిన ఓ భక్తురాలి మెడలోని ఐదు కాసుల బంగారు హారం మాయమైంది. ఈ మేరకు సదరు భక్తురాలు ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసింది. పెదవేగి మండలం అంకన్నగూడేనికి చెందిన కోసూరి దుర్గా ప్రభావతి ఈ నెల 3న స్వామివారి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలిసి ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయానికి వచ్చారు. స్వామి దర్శనానంతరం తిరుగుప్రయాణంలో ఆలయ పార్కింగ్ ప్రదేశం వద్దకు వచ్చి చూసుకునేసరికి మెడలో బంగారు హారం లేదు. సీసీ కెమేరాలో పరిశీలించగా కొబ్బరికాయలు కొట్టే ప్రదేశం వద్ద ఆ నగ ఆమె మెడ నుంచి జారిపడినట్లు ఉంది. ఆ హారాన్ని గుర్తుతెలియని మహిళ తీసుకుని అక్కడి నుంచి జారుకున్నట్లు సీసీ ఫుటేజ్ ద్వారా గుర్తించారు.

భార్య పుట్టింటికెళ్లిడంతో భర్త ఆత్మహత్య

ఏలూరు క్రైం, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో జీవితంపై విరక్తి చెంది పురుగుమందు తాగిన వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. గత నెల 28న పురుగుమందు తాగడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రుకు చెందిన దొర్ల సాంబశివరావు(35)కు భార్య, కుమారుడు ఉన్నాడు. కూలిపనులు చేస్తూ జీవిస్తున్నాడు. జీవనోపాధి నిమిత్తం ముసునూరు అత్తింటికి వెళ్లి అక్కడే జీవిస్తున్నాడు. అయితే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఏడాది క్రితం అతని భార్య చాటపర్రు వచ్చి నివసిస్తోంది. ఒంటరిగా జీవిస్తున్న సాంబశివరావు పురుగుమందు తాగడంతో చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పాలకోడేరులో అనధికారిక లే అవుట్లపై ఫిర్యాదు

పాలకోడేరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : పాలకోడేరులో రెచ్చిపోతున్న రొయ్యల రియల్టర్లు అనే కథనాన్ని 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురించడంతో వ్యాపారుల్లో గుబులు మొదలైంది. విచ్చలవిడిగా పుట్టుకొస్తున్న ప్లాట్లు అధికారికమే అంటూ అమ్మకాలు సాగిస్తూ వ్యాపారులు నాలుగు రాళ్లు వెనకేసుకుంటున్నారు. దీనిపై కథనం వెలువడటంతో పాలకోడేరులో అనధికార లే అవుట్లలో అధికారుల హెచ్చరిక బోర్డులను పీకేసిన రియల్టర్లపై పంచాయతీ కార్యదర్శి బంగారు గోపి మంగళవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు చెబుతున్నారు.

బాలుడిపై కుక్కల దాడి.. తీవ్ర గాయాలు

ముసునూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : ముసునూరు ఎస్సీ కాలనీకి చెందిన ఏడేళ్ళ బాలుడిపై కుక్కలు విచక్షణ రహితంగా మంగళవారం దాడి చేశాయి. ఈ దాడిలో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. బాలుడిని మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే స్థానికులు కాపాడకపోతే తమ కొడుకు ప్రాణాలు పోయేవని తల్లిదండ్రులు వాపోయారు. కంటిపైన గాయానికి ఆపరేషన్ చేయాల్సి వస్తుందని వైద్యులు చెప్పినట్లు వారు తెలిపారు.

సైబర్.. సవాల్

అమాయకులను దోచుకుంటున్న నేరగాళ్లు - మాయమాటలతో వల - నిండామునిగిపోతున్న నిరుద్యోగులు

ఆడిందే ఆటగా పాడిందే పాటగా సైబర్ నేరగాళ్ల తీరు ఉంది. అమాయకులను టార్గెట్‌గా చేసి అయిన కాడికి దోచుకుంటున్నారు. ఒకడేమో పార్ట్‌టైం జాబ్ ఇంటి వద్దే పని చూపించి వేలల్లో జీతం ఇస్తామంటూ నమ్మబలికి నిరుద్యోగులను నిలువునా దోచుకుంటే.. మరొకడు ఆన్‌లైన్ ట్రేడింగ్ అని చెప్పి ముందు కొంత సొమ్ములు ఎరచూపి లక్షల్లో దోచేస్తూ మరికొంతమందిని ముంచేస్తున్నారు. లోన్ అని ఒకడు, లాటరీ అంటూ మరొకడు, విదేశీ ప్రయాణం తక్కువ ధరకే అని ఇంకొకడు మాటల గారడీతో మత్తెక్కించి మాయ చేస్తూ నిలువుదోపిడీ చేస్తున్నారు. ఇలాంటి సైబర్ నేరగాళ్లను పట్టుకోవడం పోలీసులకు సైతం సవాల్‌గా మారుతోంది.

(ఆంధ్రజ్యోతి, తాడేపల్లిగూడెం రూరల్)

అవగాహన కోసం పోలీస్ శాఖ విశేష కృషి...



సైబర్ మోసగాళ్లకు బలవ్వడానికి అవగాహనాలేమే ప్రధాన కారణం. అందుకే పోలీసులు ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు పోలీస్ శాఖ అవగాహనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈ నేరాలకు అడ్డుకట్ట వేయడానికి శాయశక్తులా కృషి చేస్తోంది.. దీనిపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించడానికి ప్రచారాలు నిర్వహిస్తోంది. ప్రజలు పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకుంటే ఇలాంటి నేరాలను అరికట్టి నేరగాళ్ల ఆటకట్టించొచ్చని పోలీసులు చెబుతున్నారు.

బయటకు రాని ఎన్నో కేసులు...

ఉమ్మడి జిల్లాలో సైబర్ నేరాలు నిత్యం నమోదవుతూనే ఉన్నాయి. వీటిలో చాలా వరకు పోలీస్ స్టేషన్ వరకు రావడం లేదు. ప్రతి నియోజకవర్గంలో రోజుకో వ్యక్తి సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతున్నట్టు నిఘా వర్గాలు చెబుతున్నాయి. అధికారికంగా నమోదవుతున్న కేసుల్లో కనీసం 10 శాతం కూడా ఫిర్యాదులు అందడంలేదు మోసపోయామని తెలుసుకుని మిన్నకుండిపోయేవారే ఎక్కువగా ఉంటున్నారు.. ఈ ఏడాది ఇప్పటి వరకూ అధికారికంగా 90 కేసులు మాత్రమే నమోదవడం గమనార్హం. వాటిలో పరిష్కరించదగ్గవి అతి తక్కువే..

సైబర్ నేరాల కట్టడికి టోల్‌ఫ్రీ నెంబర్..



పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి నేతృత్వంలో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసి మరీ ఈ సైబర్ నేరాల అదుపునకు నడుంబిగించారు. దీనికోసం సర్కిల్ పోలీస్ స్టేషన్‌ల వారీగా బ్యానర్‌లు వేయించి మరీ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసే టోల్ ఫ్రీ 100 నెంబర్‌తో పాటు సైబర్ నేరాలకు ప్రత్యేకంగా 1930కు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని వివరిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి : పి.నాగరాజు, తాడేపల్లిగూడెం పట్టణ ఎస్.ఐ.



సైబర్ నేరగాళ్లు మనకు ఫోన్ చేసి ఏదో ఒక వంకతో చిన్నపాటి ఆశ చూపి దోచేస్తారు. సైబర్ నేరగాళ్లు ముందస్తుగానే జాగ్రత్తపడటంతో వారిని పట్టుకోవడం సాధ్యపడటం లేదు.దీనికి ప్రజలే అప్రమత్తంగా ఉండాలి. పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అవగాహన కల్పిస్తున్నాం.ప్రజలు ఏ ప్రలోభాలకు, మాయ మాటలకు లొంగవద్దని అనుమానం వస్తే పోలీసులను సంప్రదించాలి.

నిబంధనలు పాటించని వాహనదారులపై 63 కేసులు

ఏలూరు క్రైం, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం రవాణాశాఖ అధికారులు ఆకస్మికంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులపై 63 కేసులు నమోదు చేసినట్టు జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం తెలిపారు. హెల్మెట్ ధరించని, డ్రైవింగ్ లైసెన్సు లేని వాహనదారులకు, త్రిబుల్ డ్రైవింగ్, భీమా లేని వాహనాలకు సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా రవాణా శాఖ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. కారునడిపేవారు డ్రైవర్‌తో పాటు డ్రైవర్ పక్కన కూర్చునే వారు కూడా సీటు బెల్టు ధరించాలన్నారు.ద్విచక్ర వాహనం నడిపే వారి వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని సూచించారు. నిరంతరం తనిఖీలు చేస్తామని మోటారు వాహన నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


వాహనాల రికార్డులను పరిశీలిస్తున్న పోలీసులు

అప్పుల బాధ తాళలేక ఆక్వా రైతు ఆత్మహత్య


నిమ్మల శ్రీను(ఫైల్)

నిడమర్రు, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ తాళలేక ఆక్వా రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నిడమర్రు మండలం పెద నింద్రకొలను గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నిమ్మల శ్రీను (42) గత కొంతకాలంగా భారీగా పెట్టుబడులు పెట్టి నిడమర్రు మండలం గుణపర్రులో రొయ్యల చెరువులను సాగు చేస్తున్నాడు. పెట్టుబడులు రాకపోగా సుమారు కోటి రూపాయల వరకు నష్టపోయాడు. దీంతో అప్పులు తీర్చలేమనే మనోవేదనతో సోమవారం విషం తాగడంతో అపస్మారక స్థితికి వెళ్లాడు. విషం తాగిన తరువాత భయపడి సోదరుడు రామకృష్ణకు ఫోన్ చేశాడు. దీంతో బంధువులు అతని కోసం గాలించగా చెరువు వద్ద ఉన్నట్టు గుర్తించి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సమయం మించిపోవడంతో శ్రీను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు శ్రీనుకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. సోదరుడు రామకృష్ణ స్థానిక నిడమర్రు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ వీరప్రసాద్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

నిల్వ ఉన్న బిర్యానీ తిని అస్వస్థత

ఏలూరు క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : నిల్వ ఉన్న చికెన్ బిర్యానీ తిని ఒక మహిళ ఆమె మనుమడు, మనుమరాలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఏలూరు మండలం ప్రత్తికోళ్లలంకకు చెందిన సుందరమ్మ, మనవరాలు 6వ తరగతి చదువుతున్న సుబ్బలక్ష్మి, బాలుడైన మనుమడు ముగ్గురూ సోమవారం రాత్రి వండిన బిర్యాని మిగిలిపోవడంతో మంగళవారం ఉదయం తిన్నారు. మధ్యాహ్నం సమయానికి ఈ ముగ్గురు అస్వస్థతకు గురికావడంతో గుర్తించిన కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా చికిత్స అందించారు.

ఆకతాయిల ఆటకట్టించేందుకు ప్రత్యేక చర్యలు

డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టిన పోలీసులు - మహిళల భద్రతే ప్రధాన లక్ష్యమని స్పష్టీకరణ

భీమవరం క్రైం, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : మహిళల భద్రత, ఈవ్ టీజింగ్ కట్టడి దృష్ట్యా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే భీమవరం రూరల్ పోలీసులు కార్యాచరణను అమలులో పెట్టారు. భీమవరం రూరల్ పరిధిలో ఉన్న పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థుల పట్ల యువకులు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారంటూ ఫిర్యాదులు రావడంతో చర్యలు చేపట్టినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ నేపథ్యంలోనే డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేసి ఈవ్ టీజింగ్, విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే విద్యార్థులు, అలాగే బహిరంగంగా మద్యం తాగేవారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఇటీవల కాలంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోవడంతో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, భీమవరం డీఎస్పీ జయసూర్యల ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈ డ్రోన్ కెమెరాల వల్ల మహిళల భద్రతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, పోలీసు శాఖ వెంటనే చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. ఆయనతో పాటుగా రూరల్ ఎస్ఐ వీర్రాజు, రూరల్ హెడ్ కానిస్టేబుల్ మహేష్, ఏఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.


బీవీ రాజు కళాశాల వద్ద డ్రోన్ ఎగరేస్తున్న పోలీసులు

రైతులు సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి

లింగపాలెం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ సాగుపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి కోటగిరి మురళీకృష్ణ అన్నారు. లింగపాలెం మండలం యడవల్లిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. పంటపొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో ఆధునిక సాంకేతికను రైతులు అందిపుచ్చుకోవాలని సూచించారు.

రహదారులు ఆక్రమించొద్దు : కమిషనర్

చింతలపూడి, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : రహదారులను ఆక్రమిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ డి.పావని హెచ్చరించారు. బైపాస్‌లోని బడ్డీ దుకాణాలను తొలగించాలని ఆదేశించారు. ఇందులో భాగంగా మంగళవారం విద్యుత్ శాఖ అధికారులు బడ్డీ దుకాణాలకు ఇచ్చిన విద్యుత్ సర్వీసులను తొలగించారు. ఆక్రమణదారులు స్వతహాగా తొలగించకపోతే నగర పంచాయతీ తరపున తొలగిస్తామని, డ్రెయినేజీలపై ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని, తోపుడు బండ్లు పెట్టవద్దని సూచించారు.

గుంటూరు మహాధర్నాను జయప్రదం చేయండి

ఏలూరు కార్పొరేషన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 11న గుంటూరులో జరిగే మహాధర్నాకు సభ్యులంతా తరలిరావాలని జిల్లా నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఏలూరు స్ఫూర్తి భవనం వద్ద ఇందుకు సంబంధించిన బ్రోచర్లను వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమానికి, సొసైటీలకు 2 వేల 500 కోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు. 11న జరిగే ధర్నాకు జిల్లా నుంచి గొర్రెలు, మేకల పెంపకందారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర సమితి సభ్యులు మాగంటి సూర్యనారాయణ, జిల్లా నాయకులు కొలుసు శ్రీనివాసరావు, నెరుసు నాగరాజు, ఏఐటీయుసి నాయకులు పుప్పాల కన్నబాబు, పొట్టేలు పెంటయ్య ఉన్నారు.

12న వ్యవసాయ కార్మిక సంఘం మహాధర్నా

ఏలూరుకార్పొరేషన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ, పేదల సమస్యల పరిష్కారానికై ఈ నెల 12న వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్ వద్ద మహాధర్నాను నిర్వహిస్తున్నట్టు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి పిలుపునిచ్చారు. మంగళవారం ఏలూరు అన్నేభవనం వద్ద మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వంద రోజులు పని పూర్తి చేసుకున్న గ్రామీణ పేదలకు అదనంగా పని దినాలు, సమ్మర్ అలవెన్స్‌లు, పేస్లిప్‌లు, పెండింగ్ వేతనాలు, ఉపాధి మేట్లకు ఐదు రూపాయలు పారితోషకం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం ప్రతీ గ్రామం నుంచి పేదలు మహాధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, నాయకులు ఎం.జీవరత్నం, తామా ముత్యాలమ్మ, వై.నాగేంద్రరావు, ఎస్.మహం కాళిరావు, మడకం సుధారాణి, ఉడత వెంకటేష్,ఎ.ప్రభాకర్, వై.సీత, కారం దుర్గ, సి.హెచ్.మాధవ, ఎస్.సాయి కృష్ణ, చలపతి, చంటి, రాజశేఖర్, అంజయ్య పాల్గొన్నారు.

శాంతి స్థాపనకు క్రైస్తవులు పునరంకితం కావాలి

కామవరపుకోట, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : క్రీస్తు బోధనలు పాటిస్తూ సమాజంలో శాంతిని నెలకొల్పేందుకు విశ్వాసులు పునరంకితంకావాలని ఏలూరు బిషప్ పొలిమేర జయరావు పేర్కొన్నారు. తడికలపూడిలోని హైస్కూల్ రోడ్డులో గట్టుపై ఉన్న లూర్దుమాత పుణ్యక్షేత్రం వద్ద ఈ నెల ఒకటిన ప్రారంభమైన ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ వేడుకలకు ఏలూరు బిషప్ పొలిమేర జయరావు ముఖ్య అతిథిగా హాజరై దివ్యబలిపూజను నిర్వహించి శాంతి సందేశాన్ని అందచేశారు. కార్యక్రమంలో ఫాదర్ దోమతోటి నతానియేలు, పిల్లి ఆంథోని దాస్, చార్లెస్, జోసెఫ్, పొచ్చెర్ల అచ్యుత్ తదితర ప్రముఖులు, క్రైస్తవ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ అక్రమాలపై విచారణ జరపాలి

బుట్టాయగూడెం, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : పోలవరం ఆర్‌అండ్‌ఆర్ భూముల అక్రమాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో ప్రభుత్వం విచారణ చేయించాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం దుద్దుకూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొందరు వ్యక్తులు ప్రభుత్వ మిగుల భూములను కౌలుకిచ్చి లక్షలాది రూపాయలు దండుకుంటున్నారని వీరికి కూటమి ప్రభుత్వంలోని పెద్దల అండదండలు ఉన్నాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో పోలవరం నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని, ఆక్రమణలకు గురైన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. 200 ఎకరాలకుపైగా అక్రమార్కుల చేతుల్లో ఉన్నా ముఖ్యనేతల వత్తిడి కారణంగా చర్యలు తీసుకోలేకపోతున్నారని అన్నారు.

నూతన విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీనివాస్‌కు అభినందనలు

ఉంగుటూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు మండలం నారాయణపురం విద్యుత్ శాఖ ఏ.డి.ఈ.గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నరాలశెట్టి శ్రీనివాస్‌ను మంగళవారం ఆయన కార్యాలయంలో తెలుగుదేశం నాయకులు కలిసి అభినందించారు. కార్యక్రమంలో మండల టి.డి.పి. అధ్యక్షులు పాతూరి విజయకుమార్, కడియాల రవిశంకర్, ఇమ్మణ్ణి గంగాధరరావు, కంబంపాటి పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

'సమాజాభివృద్ధికి బాల్య వివాహాలు అవరోధాలు'

పెదవేగి, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహాల వల్ల ఆడపిల్ల ఆరోగ్యానికి అనర్థమని విజయరాయి సెక్టారు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.మేరీబాయి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ అవగాహన వేడుకల్లో భాగంగా బాల్య వివాహాలు నిర్మూలించాలనే సందేశంతో పెదవేగి మండలం నడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బాలికలకు నిర్వహించిన సమావేశంలో బాలికావిద్య, వారి ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేరీబాయి మాట్లాడుతూ బాల్య వివాహాలు సమాజ అభివృద్ధికి అవరోధంగా ఉంటాయన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి బాలిక దశనుంచే ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఆమె వివరాంచారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నడక ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

కొయ్యలగూడెం, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : నడక ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వాకర్స్ క్లబ్ అధ్యక్షులు రాంబాబు, ఎస్.బి.జి.శేఖర్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఉదయం స్థానిక కళాశాల గ్రౌండ్‌లో వాకర్స్ అంతా సమావేశం అయ్యారు. ప్రతీరోజు వాకింగ్ చేయడం వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. వాకర్స్ క్లబ్ ద్వారా ఎన్నో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కళాశాల గ్రౌండ్‌లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పది రోజుల్లో పాఠశాల సమస్యలు పరిష్కరిస్తాం

కొయ్యలగూడెం, మార్చి4 (ఆంధ్రజ్యోతి): పాఠశాల సమస్యను మండలంలోని దిప్పకాలయపాడు యూపీ పాఠశాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పది రోజుల్లో పరిష్కారానికి కృషి చేస్తామని టీడీపీ పార్టీ పరిశీలకులు పుచ్చా విజయ్ కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం దిప్పకాయలపాడు యూపీ పాఠశాల వద్ద తమ పాఠశాలను యధావిధిగా కొనసాగించాలంటూ ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఈ సమస్యను ఎమ్మెల్యే, ఎంపీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పదిరోజుల్లో సమస్యకు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా పరిషత్ జడ్పీ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లైన్‌మన్‌ల సేవలు వెలకట్టలేనివి : సాల్మన్ రాజు


లైన్‌మన్ నాగరాజును సన్మానిస్తున్న అధికారులు

ఏలూరు రూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖలోని లైనమన్‌ల సేవలు వెలకట్టలేనివని ఆ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సాల్మన్‌రాజు అన్నారు. జాతీయ లైన్‌మన్ దివస్ సందర్భంగా ఏలూరు సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన పాల్గొని లైన్‌మన్‌ల సేవలను కొనియాడారు. వరదలు, తుఫాన్లు సమయంలోనూ ప్రాణాలకు తెగించి విద్యుత్ అంతరాయం లేకుండా చూసే ఏకైక వ్యక్తులు లైన్‌మన్‌లు అని అన్నారు. లైన్‌మన్‌ల ఉత్తమసేవల కారణంగా ఏలూరు జిల్లా క్రిసిల్ రేటింగ్‌లో మొదటి స్థానంలో ఉందని, ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన 14 మంది లైన్‌మన్‌లకు ప్రశంసాపత్రాలు అందించి సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఈఈలు కె.ఎం.అంబేద్కర్, పీఏ ఖాన్, పి.రాధాకృష్ణ, పి.శశిధర్, కె.శ్రీనివాస్, నాయకులు టి.రామకృష్ణ, ఎం.రమేష్, ఎస్.బలుసు బాబు, జి.ఎ.వి. పాల్, అబ్బాస్, ఏ.డి.ఈలు రమాదేవి, ఎస్.సుజాత పాల్గొన్నారు.

ఉత్తమ లైన్‌మన్ నాగరాజుకు సన్మానం

కామవరపుకోట : కామవరపుకోట లైన్‌మెన్‌గా పనిచేస్తున్న నాగరాజును జిల్లా విద్యుత్ శాఖాధికారులు ఉత్తమ లైన్‌మెన్‌గా ఎంపిక చేసి సత్కరించారు. గ్రామ పరిధిలో విద్యుత్ సమస్యలను సకాలంలో స్పందించి ఉత్తమ సేవలు అందించినందుకుగాను నాగరాజును సన్మానిస్తున్నట్టు సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ సాల్మన్‌రాజు, డిఇలు పీర్ అహ్మద్‌ఖాన్, పి.రామకృష్ణ, కె.ఎం.అంబేద్కర్‌లు నాగరాజును దుశ్శాలువాతో సత్కరించి అవార్డును అందజేశారు. నాగరాజుకు ఉత్తమ లైన్‌మన్‌గా అవార్డు లభించడం పట్ల సీపీఐ మండల కార్యదర్శి టి.వి.ఎస్. రాజు మిత్రబృందం హర్షం వ్యక్తం చేశారు.

సీసీ రోడ్లు ఓకే.. డ్రెయినేజీల సంగతేంటి?

చింతలపూడి, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : ప్రగడవరం పంచాయతీ దళితవాడలో డ్రెయినేజీలు అధ్వానంగా మారాయి. గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించినా డ్రెయినేజీలు వదిలేశారు. దీంతో కాలనీలు మురికివాడలా మారుతున్నాయని, పగలు, రాత్రి దోమలు ముసురుతున్నాయని ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, డ్రెయినేజీ నిర్మించి దళితవాడలో సమస్య పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని కూటమి నాయకులు కె.టి.ఆర్. ఆరోపించారు. దీనిపై పలుమార్లు అధికారులను కలిసినా పట్టించుకోవడంలేదని, జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ


పేరాబత్తులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు


తిరుమలదేవిపేటలో నాయకుల సంబరాలు


జంగారెడ్డిగూడెంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహిస్తున్న నాయకులు

ప్రజల నమ్మకానికి ప్రతీక

ఎమ్మెల్సీ ఫలితాలపై సర్వత్రా హర్షం - గ్రామాల్లో కూటమి నాయకుల సంబరాలు

టి.నరసాపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : కూటమి పట్టభద్రుల ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు పట్ల తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శులు శీలం వెంకటేశ్వరరావు, జయ్యవరపు శ్రీ రామమూర్తి, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మినారాయణ, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు నాయుడు రామకృష్ణారావు గౌడ్, మాజీ జడ్పీటీసీ సభ్యులు నల్లూరి వెంకట చలపతిరావులు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తిరుమలదేవి పేటలో కేక్‌కట్ చేసి సంబరాలు నిర్వహించారు. పట్టభద్రులు కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను గుర్తించి కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించారని వారు తెలిపారు.

బాధ్యతగా పని చేస్తాం : చింతమనేని

పెదవేగి : కూటమి ప్రభుత్వంపై ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఐదేళ్ల అరాచక పాలనుంచి ప్రజలు విముక్తి పొంది, స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నారని, ఇది కూటమి ప్రభుత్వంపై ప్రజలకున్న నమ్మకమని అన్నారు. తాజాగా జరిగిన పట్టభద్రుల ఎన్నికల్లో ప్రజలు మరోసారి నిరూపించారని అన్నారు. అభివృద్ధి, ప్రభుత్వ ఆశయాలను పట్టభద్రులు అర్థం చేసుకున్నారని, దీంతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి దోహదపడ్డారని అన్నారు. ఈ విజయంతో ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకానికి అనుగుణంగా మరింత బాధ్యతతో పనిచేస్తామని ప్రభాకర్ పేర్కొన్నారు.

కామవరపుకోట మండలంలో సంబరాలు..

కామవరపుకోట : కూటమి బలపరిచిన టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం అఖండ విజయం సాధించడం పట్ల మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు వేడుకలు నిర్వహించి ర్యాలీలు జరిపారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, మండల తెలుగుదేశం అధ్యక్షులు కిలారు సత్యనారాయణ, సర్పంచ్‌లు పసుమర్తి పార్థసారథి బాబు, గోరింక దాసు, వేముల నాగేశ్వరరావు, ఎంపీటీసీ కంఠమనేని పుష్పరాజ్యం, అంజిమూర్తి, బేతిన వెంకట్రావు బృందం హర్షం వ్యక్తం చేశారు.

అభ్యర్థుల గెలుపు పట్ల ఎంపీ హర్షం

ఏలూరు టూటౌన్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థులు పేరాబత్తుల రాజశేఖరం, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు విజయం సాధించడం పట్ల ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. వారిరువురికి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి మద్దతుగా నిలిచిన విద్యావంతులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా మద్దతుగా నిలిచారన్నారు. కూటమికి ప్రజల మద్దతు ఉందనడానికి నిదర్శనం ఎమ్మెల్సీ ఎన్నికలేనని అన్నారు. అభ్యర్థుల విజయానికి తీవ్రంగా శ్రమించిన నాయకులకు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు.

కూటమి కృషిని పట్టభద్రులు గుర్తించారు

ఏలూరుటూటౌన్ : పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పు కూటమి ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఎనిమిది నెలల్లోనే రాష్ట్రం సామాజికంగా, ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కరించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను పట్టభద్రులు గుర్తించారని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపునకు కూటమి ప్రభుత్వ పనితీరే కారణమని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని అన్నారు.

పరిమి సత్తిపండు హర్షం...

ఏలూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయం సాధించడం పట్ల జంగారెడ్డిగూడెం టీడీపీ సీనియర్ నాయకుడు పరిమి సత్తిపండు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం త్వరలోనే డీఎస్సీ ప్రకటించబోతోందని తెలిపారు.కూటమి అభ్యర్థి రాజశేఖరం గెలుపునకు సహకరించిన ప్రతి ఒక్కరికీ సత్తిపండు కృతజ్ఞతలు తెలిపారు. జంగారెడ్డిగూడెం టీడీపీ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చారు. అనంతరం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రావూరి కృష్ణ మాట్లాడుతూ రాజశేఖరానికి ఓట్లు వేసిన పట్టభద్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రాజశేఖరానికి అభినందనలు...

ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయంపై రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఏలూరులోని సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ హాలు వద్ద టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులతో కలిసి రామలింగేశ్వరరావు రాజశేఖరానికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలంతా కూటమికే మద్దతు...

లింగపాలెం : ప్రజలు కూటమితోనే ఉన్నారనేందుకు ఎమ్మెల్సీ అభ్యర్థులు విజయమే నిదర్శనమని మండల టీడీపీ అధ్యక్షుడు చలపతిరావు అన్నారు. ఈ మేరకు హర్షం వ్యక్తం చేసిన వారిలో మోరంపూడి మల్లికార్జునరావు, గారపాటి బుజ్జయ్య, ఎం.వరప్రసాద్, టి.రాధాకృష్ణ, పి.శ్రీనివాసరావు, సి.హెచ్.రామ్మోహనరావు, జి వెంకటేశ్వరరావు ఉన్నారు.

హెల్మెట్ మీ ప్రాణాలు కాపాడుతుంది : డీఎస్పీ

పెదవేగి, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : హెల్మెట్ ప్రతి ఒక్కరి ప్రాణాలను కాపాడుతుందని నూజివీడు డీఎస్పీ కేవీవీఎస్వీ ప్రసాద్ అన్నారు. పెదవేగి పోలీస్ స్టేషన్‌ను మంగళవారం సందర్శించిన ఆయన హెల్మెట్ ధారణపై మాట్లాడుతూ రహదారి ప్రమాదాల్లో అత్యధిక శాతం మరణాలు తలకు తగిలిన గాయాల కారణంగానే జరిగాయని ఆయన చెప్పారు. కానీ ద్విచక్రవాహనదారులు ప్రాణ రక్షణకు సంబంధించిన నిబంధనలు సక్రమంగా పాటిస్తే ప్రమాద సమయంలో జరిగే మరణాలను చాలా వరకు నివారించే వీలుంటుందని అన్నారు. ద్విచక్రవాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్‌ను ధరించాలని, అదే వారి రక్షణతోపాటు కుటుంబ సంరక్షణ సాధ్యపడుతుందని డీఎస్పీ తెలిపారు. హెల్మెట్ పెట్టుకుంటే చాలా ప్రాణాలు నిలుస్తాయని, ప్రభుత్వం దీనిపై ఎంతగానో అవగాహన కల్పిస్తోందని, హెల్మెట్ పెట్టుకోవడాన్ని అలవాటుగా చేసుకుని ప్రాణాలు నిలుపుకోవాలని ఆయన హితవు పలికారు. దీంతోపాటు కార్లలో సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలని చెప్పారు. ఎవ్వరో బలవంతం చేశారని హెల్మెట్ పెట్టుకోవడం, సీటుబెల్టు ధరించడం కాకుండా విలువైన మీ ప్రాణాల సంరక్షణకు నిబంధనలు పాటించాలని డీఎస్పీ ప్రసాద్ వివరించారు. డీఎస్పీ వెంకట పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు, ఎస్ఐ కె.రామకృష్ణ ఉన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ

చిరుధాన్యాలు, యోగాసనాలతో ఆరోగ్యం

ద్వారకాతిరుమల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా తీసుకుంటూ యోగాసనాలను అలవర్చుకుంటే మహిళలు ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగించవచ్చని ఐసిడిఎస్ సూపర్వైజర్ మేరీ అన్నారు. ద్వారకాతిరుమల ఎస్సీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో జంగారెడ్డిగూడెం సెక్టార్ అధికారులు వివిధ అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. కొర్రలు, సామలు, అండుకొర్రలు, జొన్నలు, సజ్జలు, రాగులు వంటి ధాన్యాలను తీసుకుంటే మానసిక దృఢత్వంతో పాటు ఆర్థరైటిస్, రక్తహీనత, మలబద్ధకం వంటి పలుసమస్యలకు చెక్ పెట్టవచ్చన్నారు. అనంతరం మహిళా పోలీస్ పి.లక్ష్మీసుజన ఈ కార్యక్రమానికి హాజరైన మహిళలతో యోగాసనాలను వేయించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడీలు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు అవగాహన

ఏలూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జంగారెడ్డిగూడెం సుబ్బంపేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఐసీడీఎస్ సీడీ పీవో పి.బ్యూలా అధ్యక్షతన గర్భిణీలకు, బాలింతలకు సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లూక్ స్టీఫెన్ చిరుధాన్యాలు, ఆకుకూరలపై కలిగే లాభాలను తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్తలు లీలా రాణి, రత్నకుమారి పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

ఏలూరు క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖ విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. జిల్లా ఎస్పీ కెపిఎస్ కిశోర్ ఆదేశాల మేరకు ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు.

రక్షణ చట్టాలపై అవగాహన

దెందులూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : బాలికలు, మహిళల రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని దెందులూరు అంగన్వాడీ సెక్టార్ సూపర్‌వైజర్‌లు చిట్టమ్మ, శ్రీదేవి, పద్మభూషణం పేర్కొన్నారు. మండలంలోని దెందులూరు, కొవ్వలి, సోమవరప్పాడు సెక్టార్ల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం, చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగహన కల్పించారు.

శ్మశాన వాటిక సమస్య పరిష్కరించాలి

బుట్టాయగూడెం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): బుట్టాయగూడెం దళితులకు చెందిన స్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలని మంగళవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సంఘాల నాయకులు స్మశాన వాటికలో ఆందోళన చేశారు. అంబేద్కర్‌పేటకు చెందిన దళితురాలు చనిపోవడంతో స్మశాన వాటికకు వెళ్ళడానికి సరైన మార్గం లేకపోవడంతో దళితులు అనేక ఇబ్బందులు పడ్డారు. కెవిపిఎస్ నాయకుడు అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ స్మశాన వాటిక మొత్తం మొత్తం ఆక్రమణలకు గురైందని తెలిపారు. శ్మశాన వాటికను ఆక్రమించకుండా చుట్టూ సిమెంట్ స్తంభాలతో కంచె వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.డేవిడ్‌రాజు, గొల్లపల్లి వెంకటేశ్వరావు, కె.కార్తీక్, గంధం ఇశ్రాయేలు, కొదం ఆనంద్, నిట్టా రవికుమార్, గంగాధర్, గంజి ఏలియా పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ఏలూరు అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : సీఆర్‌ఆర్ కళాశాలలో మంగళవారం విద్యా ర్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి రవికిరణ్ కంటివైద్యశాల బృందం ఆధ్వర్యంలో నేత్రవైద్య పరీక్షలు నిర్వహించారు. కరస్పాం డెంట్ డాక్టర్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ రామరాజు, కంటి వైద్యులు డాక్టర్ హేమలత పాల్గొన్నారు.


దివ్యదుర్గను అభినందిస్తున్న టైలర్లు

ఎస్సైగా ఎంపికైన దివ్యదుర్గకు సన్మానం

కొయ్యలగూడెం, మార్చి4 (ఆంధ్రజ్యోతి) : టైలర్ కుమార్తె ఎస్సైగా ఎంపికై ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. దీంతో మండలంలోని టైలర్‌లంతా ఎస్సై దివ్యదుర్గను అభినందించారు. మండలంలోని కన్నాపురం గ్రామానికి చెందిన టైలర్ ప్రసాద్ కుమార్తె దివ్య మహిళా పోలీస్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ ఇటీవల ఎస్సైగా ఎంపికయ్యారు. దీంతో కన్నాపురంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు దివ్యదుర్గను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆంజనేయరాజు, టైలర్ వెంకటరమణ, చెప్పుల మధు, గణపతి తదితరులు ఉన్నారు.



శ్రీవారి సేవలో కోనసీమ జిల్లా జేసీ నిశాంతి

ద్వారకాతిరుమల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయాన్ని కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి మంగళవారం సాయంత్రం సందర్శించారు. ఆలయానికి వచ్చిన ఆమెకు అధికారులు, అర్చకులు దేవాలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అర్చకులు ఆమెకు స్వామివారి శేషవస్త్రాన్ని ఇచ్చి వేదాశీర్వచనం అందించారు. అనంతరం ఆమెకు ఆలయ అధికారులు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని ప్రసాదాలను అందజేశారు.

ప్రజా సంక్షేమానికి కూటమి ప్రణాళికలు

ఏలూరుటూటౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ రానున్న రోజుల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమపాలలో అభివృద్ధి చేస్తామన్నారు. గొర్రెలు, మేకలకు ఉచిత బీమా సౌకర్యం అమలు చేయాలని, 55ఏళ్ల పైబడి పెంపకందారులకు రూ.5 వేలు పింఛన్ మంజూరు చేయాలన్నారు. సబ్సిడీ రుణాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎం.సూర్యనారాయణ, శ్రీనివాసరావు, ఎన్.నాగరాజు, కన్నబాబు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ఇంటర్వ్యూ..

పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు

ఆకుల దుర్గాజ్యోతి, పశువైద్య శాఖ ఏడీ, దెందులూరు



● పశువులకు వచ్చే వ్యాధుల పట్ల తీసుకున్న చర్యలేమిటి?

జవాబు : మండల పరిధిలోని 17 పంచాయతీల్లో గేదేలు, ఆవులు అన్ని కలిపి 15 వేల 210 పశువులున్నాయి. వీటికి గాలికుంటు వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అవి రాకుండా పాడి రైతులకు అవగాహన కల్పించి వ్యాక్సిన్‌లను వేస్తున్నాం. ఆడ దూడలకు 4 నుంచి 8 నెలల వయస్సులో బూసిల్లా వ్యాక్సిన్‌లు వేస్తున్నాం.

● బహువార్షిక పశుగ్రాస సాగు పథకం అంటే ఏమిటి?

జవాబు : పశువుల మేత కోసం గడ్డిని పెంచుకునేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధిచేకూరుస్తున్నాం. రైతులకు భూమి ఉంటే వాటిలో మేత కోసం గడ్డి పెంచుకునేందుకు విడతల వారీగా ఉపాధి హామీ పథకం ద్వారా 33 వేల రూపాయలను అందిస్తున్నాం.

● రైతులకు మీరిచ్చే సూచనలేమిటి?

జవాబు : పాడి రైతులు సమయానికి తప్పని సరిగా వ్యాధి నిరోధిక టీకాలను వేయించాలి. పశువులను ఉంచే ప్రదేశం మురుగు నిల్వ లేకుండా పొడిగా ఉండే ప్రదేశంలో వాటిని ఉంచాలి. పశువులకు నిల్వ నీరు కాకుండా శుభ్రమైన నీరు పెట్టాలి. ఎండ తగలని సమయంలో మాత్రమే వాటిని మేతకు తీసుకెళ్లాలి.

(ఆంధ్రజ్యోతి, దెందులూరు)

ఘనంగా అన్నసమారాధన

పెదపాడు, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద దాత ద్రోణాదుల సత్యనారాయణ సహకారంతో సుమారు 200మంది భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు తెలిపారు. స్వామికి మంగళవారం ప్రీతికరమైన రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సేవా బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఏలూరులో స్వామి సన్నిధిలో...

ఏలూరుకార్పొరేషన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : ఫాల్గుణ మాసం తొలి మంగళవారం సందర్భంగా నగరంలోని కోటదిబ్బ వద్ద, పాండురంగ సెంటర్ల వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయాల వద్ద ఆలయ నిర్వాహకులు భక్తులకు మహా అన్నప్రసాద వితరణను ఏర్పాటు చేశారు. కోటదిబ్బ వద్ద ఆలయ ధర్మకర్త చిందా రాజు భక్తులకు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేయగా, రేషన్ డీలర్ల సంఘ నాయకులు సేవలందించారు. పాండురంగ సెంటర్‌లోని దాసాంజనేయస్వామి కోవెల వద్ద ఆలయ ధర్మకర్త రెల్ల రామకృష్ణ, మిత్రబృందం 603 మందికి మహా అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనం

చికెన్ వ్యర్థాలు స్వాధీనం

పెదపాడు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న రెండు ఐషర్ వాహనాలను పట్టుకున్నట్టు పెదపాడు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.ఐ మాట్లాడుతూ తోటగూడెం, వడ్డిగూడెం రహదారి వద్ద సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి రెండు ఐషర్ వాహనాలను పట్టుకున్నట్టు తెలిపారు.ఈ రెండు వాహనాల్లో సుమారు 20 వేల కిలోల చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకుని గొయ్యి తీసి పూడ్చి పెట్టించామన్నారు. వాహన యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్టు పెదపాడు పోలీసులు తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదైన గంటలోపే పట్టివేత

బాలుడిని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగింత

పోలవరం, మార్చి4(ఆంధ్రజ్యోతి) : మిస్సింగ్ కేసు నమోదైన గంటలోపే కేసును చేధించి పోలీసులు శభాష్ అనిపించుకున్నారు. తప్పిపోయిన బాలుడిని మంగళవారం తల్లిదండ్రులకు అప్పగించారు. పోలవరం ఎస్ఐ పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టిసీమ పంచాయతీ బంగారమ్మపేట గ్రామానికి చెందిన కళ్లపల్లి మేఘ సాయి అశ్వంత్ పోలవరం గ్రామంలో ఓ ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఇంట్లో తల్లి మందలించడంతో అలిగి తెల్లవారు జామున వెళ్లిపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు బాలుడి ఫొటోను వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశారు. ఒక మహిళ తూర్పు గోదావరి జిల్లా తాళ్ళపూడి బస్ స్టాండు సమీపంలో ఉన్న బాలుడిని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి బాలుడిని తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.



ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు బొకే అందించి అభినందనలు తెలుపుతున్న నాయకులు

ఆలపాటి విజయ దుందుభి

- రాజధాని ప్రాంతంలో టీడీపీ విజయ భేరి
- ప్రత్యర్థిని దారుణంగా మట్టి కరిపించి.. విజయకేతనం
- సాధించిన ఓట్లు 1,45,057 , మెజారిటీ 82,230
- ఉమ్మడి కృష్ణాలోనూ తిరుగులేని ఆధిక్యత
- సంబరాలు చేసుకున్న టీడీపీ శ్రేణులు



లోకేశ్‌తో ఆలపాటి

ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయ దుందుభి మోగించారు. అఖండ మెజారిటీతో ప్రత్యర్థిని మట్టి కరిపించారు.యుద్ధం ఒక వైపే అన్నట్టుగా సునాయాసంగా చిరస్మరణీయ విజయాన్ని సాధించారు. ఆద్యంతం తన పట్టునే నిలుపుకున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ):

ఉమ్మడి కృష్ణా జిల్లాలోనూ ఆలపాటి రాజా హవానే సాగింది. ప్రత్యర్థికి అందనంత ఎత్తున తొలి రౌండ్ నుంచే ఆధిపత్యం ప్రదర్శించిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ 82,230 ఓట్లతో తన సమీప ప్రత్యర్థి పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుపై తిరుగులేని విజయం సాధించారు. ప్రతి రౌండ్‌లోనూ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ భారీ మెజారిటీని సాధించారు. ఊహించినట్టుగానే ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ భారీ మెజారిటీని మూటకట్టుకున్నారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఘన విజయంతో ఉమ్మడి కృష్ణా జిల్లాలో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు.

వ్యూహాత్మక అడుగులు - వార్ రూమ్ - పోల్ మేనేజ్‌మెంట్‌లలో టీడీపీ సక్సెస్ :

అమరావతి రాజధాని ప్రాంతంలో జరుగుతున్న అత్యంత ప్రతిష్ఠాత్మక ఎన్నికలు కావటంతో కూటమి శ్రేణులు ఈ ఎన్నికలో ఎట్టి పరిస్థితులలోనూ ఆలపాటి గెలుపొందాలని ఆకాంక్షించటంతో పాటు క్షేత్ర స్థాయిలో కూడా అలాగే పనిచేశాయి. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ భారీ విజయంలో తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి వ్యూహాత్మకంగా అనుసరించిన విధానం కూడా బాగా కలిసి వచ్చింది. తెలుగు దేశం పార్టీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజయంలో సమిష్టి కృషి దాగి ఉంది. ఎమ్మెల్సీ నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచే టీడీపీ అధిష్ఠానం తమ నాయకులను అప్రమత్తం చేసింది. ప్రధానంగా ప్రజా ప్రతినిధులపై కీలక బాధ్యతలను మోపింది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నామినేటెడ్ పదవులు పొందిన వారు ఇలా ప్రతి ఒక్కరికీ బాధ్యతలను ఆలపాటి రాజా గెలుపుకు భాగస్వాములను చేసింది. పార్టీ నాయకులను మరో వైపు ఉపయోగించుకుంది. జిల్లా, నియోజక వర్గ, మండల స్థాయిలో పార్టీ నాయకత్వానికి పోల్‌మేనేజ్‌మెంట్ బాధ్యతలను అప్పగించింది. నూరు శాతం పార్టీకి చెందిన వారి ఓట్లు పడేలా చర్యలు చేపట్టారు. పట్టభద్ర ఓటర్లను ఒక ఉధృతస్థాయిలో చేర్పించటంలో టీడీపీ శ్రేణులు కృతకృత్యులయ్యాయి. ఈ స్థాయిలో ప్రత్యర్థి వర్గం ఓట్లను చేర్పించలేదు. ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎప్పటికప్పుడు కొత్తగా ఓట్లను చేర్చాల్సి ఉంటుంది. కాబట్టి జీరో నుంచి ఓట్ల నమోదు ప్రారంభం అవుతుంది. ఈ అవకాశాన్ని కూటమి శ్రేణులు చక్కగా వినియోగించుకున్నాయి. ఓట్లను చేర్పించటం ఒక ఎత్తు అయితే నూటికి నూరు శాతం ఓట్లు వేయించగలిగేలా పోల్ మేనేజ్‌మెంట్‌ను చాలా చక్కగా నిర్వహించింది. మంత్రి నారా లోకేష్ వార్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. వార్ రూమ్ ద్వారా లోకేష్ ఎంతో పకడ్బందీగా పోల్ మేనేజ్‌మెంట్‌ను నిర్వహించారు. దీంతో కూటమి శ్రేణుల ప్రతి ఓటు కూడా నూరు శాతం వేసేలా కృషి చేయగలిగారు. ఇది సహజంగా ఏ పార్టీ అయినా చేసేదే అయినా.. ఆలపాటి భారీ విజయం వెనుక వైసీపీకి గట్టి బుద్ధి చెప్పాలన్న పట్టభద్రుల ఆలోచన కూడా కారణమైనట్టుగా చర్చ నడుస్తోంది.

వైసీపీకి బుద్ధి చెప్పాలన్న కసితోనూ రాజధాని పట్టభద్రుల విలక్షణత :

ఈ ఎన్నికలలో వైసీపీ తన అభ్యర్థిని నిలపకపోయినా.. పీడీఎఫ్ అభ్యర్థికి అంతర తంగా మద్దతు పలికింది. అమరావతి రాజధాని విధ్వంసానికి ఒడిగట్టిన జగన్ పార్టీ పీడీఎఫ్ అభ్యర్థికి పరోక్షంగా మద్దతు తెలపటం కూడా పట్టభద్ర ఓటర్లలో కసిని రేపింది. అమరావతి రాజధాని ప్రాంతంలో కీలకమైన స్థానాన్ని కోల్పోతే ప్రత్యర్థికి బలం ఇచ్చినట్టు అవుతుందన్న ఉద్దేశ్యంతో కూడా పట్టభద్ర ఓటర్లు తమ విస్పష్ట తీర్పును ఇచ్చారన్నది స్పష్టంగా కనిపిస్తోంది. అమరావతి రాజధాని ప్రాంత పట్టభద్ర ఓటర్లు వైసీపీకి ఆ అవకాశాన్ని ఇవ్వకుండా చేయటం గమనార్హం, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు తిరుగులేని మెజారిటీని కల్పించటం ద్వారా వైసీపీకి పట్టభద్రులు పరోక్ష సంకేతాలు పంపినట్టుగా కూడా అర్థం చేసుకోవాల్సి వస్తోంది. వైసీపీ ఈ ఎన్నికలలో పోటీలో ఉండకపోవటంతో పెద్దగా ఓట్లను కూడా చేర్చలేదు. దీంతో పాటు ఆ పార్టీకి చెందిన వారు చాలా మంది ఓటింగ్‌లో పాలు పంచుకోలేదని కూడా తెలుస్తోంది. బాగా కోపం ఉన్న వారు తప్పితే ఉమ్మడి కృష్ణా జిల్లాలో పెద్దగా ఓట్లు వేయలేదని తెలుస్తోంది. జగన్ వైఖరి కారణంగా ఇప్పటికీ మార్పు రావటం లేదన్న కారణంతో వైసీపీకి చెందిన వారు కూడా టీడీపీ అభ్యర్థికి ఓట్లు వేసినట్టుగా తెలుస్తోంది. ఇప్పుడిప్పుడే విధ్వంసానికి గురైన అమరావతి పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టడంతో మళ్లీ వైసీపీ ఆశలకు ఊతం ఇవ్వకూడదన్న ఉద్దేశ్యంతో రాజధాని పట్టభద్ర ఓటర్లు గట్టి సంకేతాలనే ఆ పార్టీకి పంపారు.

కూటమి కలసికట్టు విజయం

కూటమి కలసికట్టు విజయంగా ఇది నిలిచిపోతోంది.టీడీపీ శ్రేణులు ఎంతగా విజయం కోసం పరితపించాయో జనసేన, బీజేపీ శ్రేణులు కూడా తమ కూటమి భాగస్వామ్య పక్షం అభ్యర్థిని గెలిపించేందుకు అంతగా దోహదపడ్డాయి. టీడీపీ శ్రేణులతో కలిసి పోల్ మేనేజ్‌మెంట్‌ను ముందుకు తీసుకు వెళ్ళటంలో కూటమి భాగస్వామ్య పక్షాలు కూడా కృషి చేశాయి.

- ప్రత్యర్థికి అవకాశం ఇవ్వకుండా మొదటి ప్రాధాన్యతలోనే.. ఆలపాటి విజయదుందుభి :

ప్రత్యర్థికి ఎక్కడా అవకాశం ఇవ్వకుండా మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులోనే ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ భారీగా ఓట్లను ఆర్జించారు. దీంతో మొదటి రౌండ్ నుంచే ఆయన మెజారిటీ ప్రత్యర్థిని కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. మొత్తం 9 రౌండ్లకు కాను మొదటి రౌండ్‌లో 17,194 ఓట్లు, రెండో రౌండ్‌లో 17,527 ఓట్లు, మూడో రౌండ్‌లో 16,722, నాలుగో రౌండ్‌లో 16,236 ఓట్లు, ఐదో రౌండ్‌లో 16,916 ఓట్లు, ఆరో రౌండ్‌లో 17,028 ఓట్లు, ఏడో రౌండ్‌లో 16,477 ఓట్లు , ఎనిమిదో రౌండ్‌లో 16,900, తొమ్మిదో రౌండ్‌లో 10,087 ఓట్లు చొప్పున సాధించి మొత్తంగా 1,45,057 ఓట్లను సాధించారు.

లేగదూడల పోషణలో జాగ్రత్తలు పాటించాలి



రైతులకు బహుమతులు అందిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

ముసునూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): లేగదూడల పోషణలో రైతులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉపసంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం గోగులంపాడులో లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లేగదూడలను మంచి యాజమాన్య పద్ధతులు, బాగా పోషణా చేసిన రైతులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. నూజివీడు పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు కె.చంద్రశేఖరరావు, వైద్యాధికారి వెంకట చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడిపై కుక్కల దాడి



గాయపడిన బాలుడు

ముసునూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ముసునూరు ఎస్సీ కాలనీకి చెందిన ఏడేళ్ల బాలుడిపై కుక్కలు విచక్షణ రహితంగా మంగళవారం దాడి చేశాయి. దాడిలో బాలుడి కంటి పైభాగం, నుదురుపై గాయాల య్యాయి. బాలుడిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యులు చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కంటిపైన గాయానికి ఆపరేషన్ చేయాల్సి వస్తుందని వైద్యులు చెప్పినట్టు బాలుడి తల్లిదండ్రులు తెలిపారు. కుక్కల బెడద ఎక్కువైందని, వాటి నియంత్రణకు అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలని ఎస్సీ కాలనీ వాసులు కోరుతున్నారు.

రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేయించాలి

నూజివీడు టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : రైతులందరూ రైతు సేవా కేంద్రాల్లో విశిష్ట సంఖ్య నమోదు చేయించాలని నూజివీడు మండల వ్యవసాయశాఖ అధికారిణి ఆలూరి చాముండేశ్వరి సూచించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ వ్యవసాయ భూమి ఉన్న ప్రతిరైతు యూనిట్ ఐడీని పొందాలన్నారు. ఇందుకు సంబంధించి నూజివీడు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రైతులకు యూనిక్‌ఐడీ కేటాయింపునకు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తద్వారా రాయితీపై విత్తనాలు, ఎరువులు, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, సున్నావడ్డీ రుణాలకు అర్హత లభిస్తుందన్నారు.

ఎమ్మెల్సీ విజయంపై కూటమి నేతల హర్షం



విలేకరులతో మాట్లాడుతున్న నూజివీడు బీజేపీ నేతలు

కలిదిండి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, ఉమ్మడి కృష్ణా జిల్లాల కూటమి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ భారీ మెజార్టీతో గెలుపొందడంపై కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పోకల జోగిరాజు, వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, నున్న రమాదేవి, అండ్రాజు శ్రీనివాస్, లంకా రత్నారావు, ముద్దం భోగేశ్వరరావు, పేటేటి సత్యనారాయణ, వలవల రామారావు, చెన్నంశెట్టి మురళీకృష్ణ, ఆమజాల బాబు స్వీట్లు పంపిణీ చేశారు.

● ముదినేపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీగా కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం సాధించడంపై నాయకులు హర్షం వ్యక్తం చే శారు. టీడీపీ నియోజకవర్గ సమన్వ య కమిటీ కన్వీనర్ వీరమల్లు నర సింహారావు, మండల అధ్యక్షుడు చల్ల గుల్ల శోభనాద్రి చౌదరి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్ర కుమార్, బొప్పన సుందర రామయ్య, చలసాని జగన్మోహనరావు, టీడీపీ జిల్లా కార్య దర్శి పోసిన పాండురంగారావు, యర్రా రాంబా బు, బొంగు రవికుమార్, దావు నాగరాజు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, బాసినశెట్టి కిశోర్ తదితరులు ఆలపాటి రాజా విజయంపై హర్షం వ్యక్తం చేశారు.

● నూజివీడు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఘన విజయం సాధించడంపై బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా, మంత్రిగా విశేష అనుభవం కలిగిన సీనియర్ నాయకుడు ఆలపాటి గెలుపు అభినందనీయమన్నారు. బీజేపీ నాయకులు బోను అప్పారావు, వై.ఎస్ దొర్రై, ఎం.రాజశేఖర్, శివరాజు వసుంధరాదేవి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

● చాట్రాయి: ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఘన విజయం సాధించడంపై మండలంలోని కూటమి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూటమి నాయకులు మందపాటి బసవారెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, అత్తులూరి శ్రీనివాసరావు, బొట్టు రామచంద్రరావు, మరిడి చిట్టిబాబు, పలగాని దుర్గారావు, బొట్టు లక్ష్మణరావు, చంద్రకళ, నక్కా రాము, నోబుల్‌రెడ్డి, తల్లాడ శ్రీను, కట్టా దుర్గారావు, చిమటబోయిన పుల్లారావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కైకలూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయంపై ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. కైకలూరు నియోజకవర్గంలో కూటమి నేతలంతా కష్టపడి అత్యధిక మెజార్టీ అందించారని కార్యకర్తలు, నాయకుల పనితీరు ఎంతో హర్షణీయమన్నారు. పలువురు కూటమి నేతలు ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపుపై హర్షం వ్యక్తం చేశారు.

స్వచ్ఛందంగా రహదారి మరమ్మతులు

కలిదిండి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అధ్వానంగా ఉన్న మూల్లంక - పెదలంక ప్రధాన రహదారికి కూటమి నాయకులు మంగళవారం స్వచ్ఛందంగా మరమ్మతులు ప్రారంభించారు. రహదారిపై గోతులను ఎక్స్‌కవేటర్‌తో చదును చేసి కంకరతో పూడ్చుతున్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పిలుపు మేరకు స్వచ్ఛందంగా రహదారి మరమ్మతులు చేపట్టడంతో లంక గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జోగిరాజు, ఎత్తిపోతల కమిటీ చైర్మన్ వేగిరెడ్డి చిన్నారావు, తులసీరావు, సుబ్బరాజు, సతీష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీ



కలిదిండిలో తనిఖీ చేస్తున్న అధికారులు

కలిదిండి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో పలు ఎరువుల దుకాణాలను ఏడీఏ జి.వెంకటమణి మంగళవారం తనిఖీ చేశారు. మారుతి రామ్ ట్రేడర్స్ ఎరువుల దుకాణంలో ఫారం కాల పరిమితి దాటిన రూ.6 లక్షల విలువైన జింక్ అమ్మకాన్ని నిలుపుదల చేశామన్నారు. మస్తాన్ బాబా ఫెర్టిలైజర్స్‌లో రూ.45 వేలు విలువ గల పొటాష్ అమ్మకాన్ని నిలుపుదల చేశామన్నారు. ఏవో మండల వ్యవసాయ అధికారి విద్యాసాగర్ పాల్గొన్నారు.

● కైకలూరు: ఎరువులు, పురుగుమందులను ప్రభుత్వ నిబంధనల మేరకు విక్రయాలు జరపాలని లేకుంటే చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ ఏడీ జి.వెంకటమణి అన్నారు. మంగళవారం కైకలూరులోని పలు ఎరువుల దుకాణాల్లో స్థానిక వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఎరువులు, పురుగు మందులు నిల్వలు, స్టాక్ రిజిస్టార్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏవో ఆర్.దివ్య పాల్గొన్నారు.

యువతకు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



వర్క్‌షాప్‌లో వైద్యసిబ్బంది, నవజీవన్, బాలభవన్ కోఆర్డినేటర్లు

కైకలూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలతో జీవితాలు అంధకారంలోకి నెట్టివేయబడతాయని పీహెచ్‌సీ వైద్యాధికారి బి.శంకర్ అన్నారు. కొల్లేటికోట పీహెచ్‌సీలో నవ జీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు, సోషల్ మీడియా దుర్వి నియోగంపై మంగళవారం వర్క్‌షాప్‌ను నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించాలని లేకుంటే నేటి యువత మత్తు మైకంలో విలువైన జీవితాన్ని నిర్వీర్యం చేసుకుంటున్నారన్నారు. సోషల్ మీడియాను మేధాశక్తిని పెంపొందించేందుకు వినియోగించాలే కానీ వక్రమార్గాల్లో ఎంచుకోవడం వలన ఇబ్బందులు కొనితెచ్చుకుంటారన్నారు. అలాగే ఎక్కువ సమయం సెల్‌ఫోన్ల వినియోగం వలన మెదడుపై తీవ్ర ప్రభావం, శారీరకంగా, మానసికంగాను దాని యొక్క ప్రభావం ఎక్కువై అనారోగ్యాలకు గురవుతారన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్ కె ప్రియాంక, ఎం లీలావతి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూర్యత్రినాథ్

ట్రిపుల్ ఐటీలో టెక్‌జెట్-25 వర్క్‌షాపు

నూజివీడు టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో టెక్‌జెట్-25 కార్యక్రమంలో భాగంగా క్రియేటివ్ డిజైన్ మాస్టరీ, ఎలక్ట్రికల్ వెహికల్ అంశాలపై వర్క్‌షాపు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీయూసీ విద్యార్థులకు ఫొటోషాప్, క్యాన్‌వాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్.ఎస్.ఐ.టి సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సూర్యత్రినాథ్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రిపుల్‌ఈ విభాగంలో ఎలక్ట్రికల్ వెహికల్, అసెంబ్లింగ్, డి-అసెంబ్లింగ్‌పై వర్క్‌షాపును నిర్వహించారు.

పెన్సిల్ ఆర్ట్‌పై పోటీలు..

నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సిగ్నస్-25 కార్యక్రమంలో భాగంగా మంగళవారం పలు అంశాలపై కళా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా క్లైఆర్ట్, పెన్సిల్ ఆర్ట్‌లకు సంబంధించి విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు. ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ అమరేంద్రకుమార్, శ్రీకాకుళం డైరెక్టర్ కేవీజీడీ బాలాజి పాల్గొన్నారు.

దువ్వాడపై చర్యలు తీసుకోవాలి

నూజివీడు టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ నూజివీడు జనసేన నాయకులు ముమ్మలనేని సునీల్‌కుమార్, పట్టణ సీఐకు ఫిర్యాదు చేశారు. స్త్రీలపట్ల గౌరవం, సమాజం పట్ల, శాసనసభ పట్ల గౌరవం లేకుండా నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్న శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	121, 130, 141
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

- తహసీల్దార్ రాజ్‌కుమార్



అక్కిరెడ్డిగూడెంలో రేషన్ పంపిణీని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

ముసునూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం అక్కిరెడ్డిగూడెంలో రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈ-పాస్ మిషన్ ద్వారా పంపిణీ చేసిన రేషన్ సరుకులు, స్టాక్‌ను తనిఖీ చేశారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులను సక్రంగా లబ్ధిదారులకు పంపిణీ చేయాలని, ఎటువంటి ఫిర్యాదులు వచ్చిన సహించేది లేదన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న రీసర్వేను పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. సచివాలయాన్ని తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. రైతు సేవా కేంద్రంలో రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. వీఆర్వో హరిబాబు పాల్గొన్నారు.

మహిళలకు విద్యతోనే ఉన్నతశిఖరాలు



మాట్లాడుతున్న పీడీ శారద

నూజివీడు టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మహిళలను చదివిద్దాం, ఉన్నత శిఖరాలను అధిరోహించేలా తీర్చిదిద్దుదామని జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ పి.శారద అన్నారు. నూజివీడు మండలం గొల్లపల్లిలో అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని హెల్దీ ఉమెన్, హ్యాపీ ఉమెన్ కాన్సెప్ట్‌తో అవగాహన కార్యక్రమం అనంతరం మహిళా ఉద్యోగినిలకు క్రీడాపోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను నిర్మూలించి ఆరోగ్యకరమైనటువంటి సమాజం ఏర్పాటుకు ప్రతిఒక్కరూ చర్యలు చేపట్టాలన్నారు. మహిళలు పౌష్టికాహారంపై దృష్టి సారించాలని, చిరుధాన్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మహిళా సాధికారికత, మహిళా హక్కులు, చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏలూరు డీసీపీవో సూర్యచక్రవేణి, గొల్లపల్లి పీహెచ్‌సీ వైద్య అధికారిణి డాక్టర్ నజీమ, నూజివీడు సీడీపీవో కె.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతం

చాట్రాయి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగింది. చాట్రాయి జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో మంగళవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో వీఎస్‌వీ బ్రహ్మచారి తెలిపారు. మొత్తం 144 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 132 మంది హాజరయ్యారన్నారు.

● ముదినేపల్లి : ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ పరీక్షా కేంద్రంలో జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ -1 పరీక్షకు 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్ష కేంద్రంలో 178 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 166 మంది హాజరయ్యారని చీఫ్ సూపరింటెం డెంట్ ఓరుగంటి సత్యనారాయణ మూర్తి తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తుల పూజలు

ముదినేపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం భక్తులు అభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పలు రకాల అభిషేకాలు, పూజలు నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి పర్యవేక్షణలో అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ పూజలు చేశారు.

పెద్దింటమ్మకు ప్రత్యేక పూజలు

కైకలూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కొల్లేటి కోట పెద్దింటి అమ్మవారు నిత్యం పూజలు అందుకుంటున్నారు. మంగళవారం అమ్మవారి జాతర నాలుగో రోజు భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారికి ద్రవ్యపూజ, కలశార్చన, ధూపసేవ, బాలభోగం, నీరాజన మంత్రపుష్పాలు, పంచహారతులు, పాత్రసాధన, అష్టోత్తరనామపూజలు అర్చకులు వైభవంగా జరిపారు. అమ్మవారికి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాదాన్ని భుజబలపట్నం గ్రామానికి చెందిన వేగేశ్న ప్రసాదరాజు, వెంకటలక్ష్మీ, రుద్రరాజు పుల్లంరాజు, విజయలక్ష్మీ దంపతులు అందజేశారు. సాంస్కృతి కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం రాత్రి సింహాచల సీతారామయ్య, శ్రీ శ్యామల కళానికేతన్ పెరికేగూడెం కళాకారులు త్రివర్ణాలు నాటక ప్రదర్శన విశేషంగా భక్తులను ఆకట్టుకుంది. ఆలయ కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాసు ఏర్పాట్లను పర్యవేక్షించి సదుపాయాలను కల్పించారు.

విద్యార్థులకు ప్యాడ్‌ల పంపిణీ

ముదినేపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పెదగొన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విశ్వనాద్రిపాలెం కోటి శ్రీవల్లీ ఫౌండేషన్ పరీక్ష ప్యాడ్‌లు అందజేసింది. ఆయా పాఠశాలల్లో ఫౌండేషన్ చైర్మన్ కోటి రామచంద్రరావు 230 మంది విద్యార్థులకు మంగళవారం ప్యాడ్‌లను పంపిణీ చేశారు. హైస్కూల్ హెచ్‌ఎం కె.ఉదయభాస్కర్, నాగిరెడ్డి శివ ప్రసాద్, డీసీ చైర్మన్ గుడిసేవ సురేష్, టీడీపీ నాయకుడు గుడివాడ వేణు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

బాల్య వివాహాలను నిరోధించాలి

మండవల్లి మార్చి 4(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అడ్డుకోవడానికి అందరూ ముందుకు రావాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీహెచ్.నాగలక్ష్మి, లక్ష్మీప్రసన్న కోరారు. కైకలూరు ప్రాజెక్టు సీడీపీవో వి.దీప్తి ఆధ్వర్యంలో మండవల్లి, భైరవపట్నం, చావలిపాడు, లోకుముడి, కొవ్వాడలంక, మణుగులూరు పాఠశాలల్లో మంగళవారం కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చదువు, ఆరోగ్యం, బాల్య వివాహాల వలన అనర్థాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పెండ్లి కుమారుడి తండ్రికి బంగారు నాణెం అందజేస్తున్న సంస్థ సభ్యులు

పెండ్లి కుమారుడికి బంగారు నాణెం అందజేత

చాట్రాయి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చీపురుగూడెం పాల సహకార సంఘానికి పాలు పోస్తున్న రావి సత్యనారాయణ కుమారుడు వివాహం సందర్భంగా కృష్ణా మిల్క్ యూనియన్ కల్యాణమస్తు పథకం కింద రూ.20 వేలు విలువైన బంగారు నాణేన్ని మంగళవారం సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, క్లస్టర్ మేనేజర్ సాంబశివమూర్తి పెండ్లి కుమారుడి తండ్రికి అందజేశారు. సూపర్‌వైజర్ శివనాగేశ్వరరావు, వేతన కార్యదర్శి రాంబాబు రైతులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ముసునూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గురుకుల బాలికల పాఠశాలల్లో ఐదు, ఆరు, ఏడు, ఎనిమిదో తరగతులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.ప్రవీణ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి వి.ఎస్ మస్తానయ్య ఆదేశాల మేరకు ఈనెల 31లోగా అర్హత కలిగిన బాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25న ఉంటుందని తెలిపారు. బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నలుగురిపై బైండోవర్ కేసులు

ముసునూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ముసునూరుకు చెందిన నలుగురు ఎక్సైజ్ నేరస్థులను తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ ఎదుట మంగళవారం బైండోవర్ చేశారు. ఎక్సైజ్ సీఐ మస్తానయ్య ఆధ్వర్యంలో అనగాని రాంబాబు, కంచర్ల గంగాధరరావు, పులిచర్ల నాగేశ్వరరావు, గొల్లపల్లి నరసమ్మలను ఏడాది కాలంలో ఎక్సైజ్ నేరాలకు పాల్పడితే లక్ష రూపాయాల జరిమానాతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు. ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.